# అనివార్య విధాయకం

(షరా : మామూలు కాదు. ఈ కథలోని పాత్రలు, సన్నివేశాలు - ఏవీ కల్పితం కాదు. అన్నీ సజీవంగా ప్రాణప్రతిష్ఠ అయి ఉన్నవే. ఈ కథ అందరినీ ఉద్దేశించి వ్రాసినది. ఎవరూ నాకు సంబంధం లేదు. అనుకోనక్కర లేకుండా, హాయిగా చదువుకుని ఆనందించవచ్చు. దీనికి కథాబీజం 1985లో Iain Crichton Smith అనే ఆయన ఇచ్చారు.)

కొత్త చిగుళ్ల కుక్కుటేశ్వరరావుకు వేదాంతం అన్నా, తత్త్వశాస్త్రం అన్నా విపరీతమైన అభిరుచి.

ప్రతిదాన్నీ తార్కికంగా ఆలోచించడం, అలా ఆలోచించిన తరువాతనే ఫలితాంశాన్ని ఆమోదించడం - అన్నది అతనికి అతి చిన్నతనం నుంచి అలవాటు.

అందరూ అలా ఆలోచించరేం ?

ఆలోచనల జోలికి పోకుండానే గానుగెద్దుల్లా ఒకే తాటిని ఎందుకు నడుస్తారు? గుఱ్ఱానికి మల్లే 'బ్లింకర్స్' ఎందుకు తగిలించుకుంటారు ?

అలా ఆలోచించడం అంటే ఎంత మాత్రం ఆలోచన లేని వాళ్లని చూచి - అట్లాంటి వాళ్లు ప్రపంచం అంతటా కనిపిస్తూనే ఉంటారు - తాను జాలిపడాలా ? సిగ్గు పడాలా ? లేక రెండూ చేయాలా ? ఇదే కుక్కుటేశ్వర రావుకు అనుక్షణమూ ఎదురయ్యే సమస్య. కోపపడడం, ఛీత్కరించుకోవడం అతడు ఎన్నడో మానివేశాడు.

రాత్రి భోజనం అయిన తరువాత ఒకమైలు దూరం అయినా నడవడం ఆరోగ్యానికి మంచిదని తెలుసుకున్న తర్వాత ఆ పని చేయకుండా ఉండడం రావుకు (కొత్త చిగుళ్ల కుక్కుటేశ్వర రావు అని ప్రతిమారూ రాయడం కష్టం. కె.కె. రావు అని సూక్ష్మంగా చెబుదామన్నా ఈ సంక్షిప్తం ఇతరులకు తగిలి బాధ కలగవచ్చు. అందుకని మరీ సాధారణీకరణం చేసేసి 'రావు' అనడమే యోగ్యమైన పని అనిపిస్తోంది ప్రస్తుతానికి). సాధ్యం కాకుండా పోయింది. మైళ్లు పోయి ఉండవచ్చు. అవి కిలోమీటర్లుగా మారి ఉండవచ్చు. కాని ఈ శరీరము, నడిచే అంగాలు, రోడ్లు - యథా ప్రకారంగా ఉన్నాయి గదా ! మైలు దూరం అన్నాడు గదా అని కొలుచుకుంటూ నడవం గద. ఓపిక ఉన్నంత వరకూ వెళ్లి, ఇక చాలు అనుకున్నప్పుడు తిరుగు ప్రయాణం చేయడం !

సాయంత్రం పూటే గదా - చీకటి పడబోతోంది, ఎవరు చూడ వచ్చారులే - అని దుస్తులూ అవీ సరిగా లేకుండా రోడ్లు మీదకు రావడం రావుకు సుతారమూ

ఇష్టం లేదు. బయటకు వెళ్లదలుచుకున్నప్పుడు వేసుకోవలసిన దుస్తులలో ఎలాంటి లోపమూ ఉండగూడదు, పగలయ్యేది రాత్రయ్యేది!

తప్పనిసరికి లొంగిపోయి తప్పుదారుల్లో వెళ్లడం కంటే అసలు ఏమీ చేయకుండా ఉండడం మంచి పని!

రోడ్లు, వీధులు, ఇళ్లు పగలు చూచినప్పుడు ఒక రకంగా ఉంటాయి. రాత్రిపూట మరో రకంగా ఉంటాయి. సహజమైన సూర్యుడి వెలుగులో కనిపించే రూపం ఒకటి. రాత్రిళ్లు కృత్రిమమైన వీధిలాంతర్లు - ఎలక్ట్రిక్ దీపాల కాంతుల్లో, ఆ వెలుగుల్లో పులుముకునే రకరకాల రంగులు వేరు.

చీకటి ఒక్కటే అయినా, ఆ చీకటిని ఛేదించే వెలుగులు ఎన్నో రకాలుగా ఉండడం చూస్తున్న కొద్దీ చూడబుద్ధి అయ్యేంత వేడుకగా ఉంటుంది.

చీకటికి ఒక్కటే రంగు. కారు నలుపు.

అందుకనే చీకట్లో కూర్చుని ఉండడం అంటే మనిషికి ఇష్టం కాక - లేక - రక రకాల రంగులు పులుముకోవడం అలవాటు చేసుకుంటాడు.

చీకటిలో మరో విచిత్రం కూడా కనిపించింది రావుకు.

ఏదీ చీకటి ? వెలుగు ఉన్నచోట కనిపించదేం ?

కనిపించే చీకటి అకస్మాత్తుగా ఎక్కడకు పారిపోయిందో వెదకడం విచిత్రంగా అనిపిస్తుంది.

చీకటి కనిపించాలంటే దివిటీ పట్టుకుని తిరగాల్సిందే. అలా తిరిగినప్పుడు వెలుగు కనిపిస్తుంది తప్ప చీకటి ముందుకు రానే రాదే! కనిపించేది చీకటా ? వెలుగా ? - రెండూనా ?

రావుకు నవ్వు రావడం లేదు. లోతుకు కూరుకుపోతున్నాడు ప్రతిమారూ!

అకస్మాత్తుగా ఒక మనిషి గుర్తుకు వచ్చాడు. అతని పేరు అనక్సగోరస్ (Anaxa Gorus) అనో, ఇంకేదో అయి ఉండాలి. గ్రీస్ దేశంలో ఎప్పుడో క్రీస్తుకు పూర్వం అయిదో శతాబ్దంలో ఉండేవాడట. కాలాన్ని కొలవడానికి క్రీస్తు శకం ఒక ప్రమాణం అయి కూర్చుంది. పంచాంగం చూస్తూ శాలివాహన శకం, శక సంవత్సరం - ఇలా వేరు వేరు కొలత బద్దలు కనిపిస్తాయి. కనిపిస్తేనేం గాని, ప్రపంచం అంతా ఆమోదించిన

ఈ క్రీ. శ. ఉంది. ఇంతకూ ఈ అనక్సగొరస్ ఎందుకు గుర్తు వచ్చాడంటే - ఇతగాడు పట్టపగలే పెద్ద దివిటీ వెలుగించుకు చేత పుచ్చుకు తిరిగేవాడట. అతను వస్తున్నాడంటే రెండు మూడు క్షణాల ముందుగానే ఈ దివిటీ వాతావరణంలో పొడుచుకు వచ్చి అందరికీ కనిపిస్తూ ఉండేది. అతన్ని తెలివితేటలు లేనివాడని, మూర్ఖుడని, మూఢుడని అనుకోవటానికి లేదు. ప్రపంచంలో చాల తెలివయిన వాళ్లు గ్రీస్ దేశంలో పుట్టారట, పెరిగారట!

ఎందుకయ్యా - పట్టపగలు దివిటీ పట్టుకు తిరుగుతావు - అసలు ఈ శరీరమే బరువని మీ వాళ్లంతా బల్లలు గుద్ది చెబుతారు గదా - నడవవలసి రావడమే యాతన, ఒకచోట కుప్పకూలిపోయినట్లుగా పడి ఉండకుండా. అలాంటప్పుడు మళ్లీ చేతిలో ఈ పొడుగుపాటి దివిటీ ఏమిటి - అని ఎవరో ధైర్యం చేసి అడిగితే ఆ అనక్సగొరస్ బదులు చెప్పేవాడట :

'ఈ ప్రపంచంలో ఎక్కడయినా తెలివితేటలు ఉన్న వాడు కనిపిస్తాడేమోనని వెదుకుతున్నాను; విధీ విరామం లేకుండా. నేను చేయదల్చుకున్న పని ఇదీ' - అని. తెలివితేటలకు మూలం అయిన 'మనస్సు' కూడా పదార్థమే. కాకపోతే అది అతి సున్నితం - పవిత్రం అయిన పదార్థం సుమా - అని మొట్ట మొదటి మారు పైకి పలికింది అతనే!

అతనికి అలా తెలివితేటలు అయిన మనిషి కనిపించాడో లేదో, అతని అన్వేషణ ఉత్తరోత్తరా ఏమయిందో తెలీదు. చరిత్రలో మటుకు దివిటీ పట్టుక తిరిగే మనిషి మిగిలిపోయాడు.

అసలు - తెలివితేటలు వెదికితే కనిపిస్తాయా ? - చీకటి కనబడకుండా పోతున్నప్పుడు ! ఒకవేళ కనిపించినా, అవే తెలివితేటలు అని గమనించడానికి, గ్రహించటానికి నీకు అంతకంటె ఎక్కువ తెలివితేటలు ఉండాలిగా ! నీ దగ్గరే ఎక్కువ ఉంటే, అవతల మనిషిలో ఉన్నవి తెలివితేటలు ఎందుకు అవుతాయి ?- ఈ వెదకడం అంతా వృథా ! వృథా !!

కాని ఈ విషయం ఎవరూ అనక్సగొరస్ దృష్టికి తెచ్చి ఉండరని రావుకు తెలిసి పోయింది.

ఎవరి అవివేకంలో వాళ్లు - కుడితిలో పడ్డ ఎలుకలాగ, శ్లేష్మంలో పడిన ఈగ

లాగ - ఈదులాడుతూ ఉంటే, ఇంకా ఈ తెలివితేటల కోసం వెదుకులాడడం ఎక్కడ కుదిరి చస్తుంది ?

భవసాగరం అని పేరు పెట్టుకుని దీన్నెంతో తరింప చెయ్యమని కోట్లాది సంవత్సరాలుగా మనిషి ఎవరినో దేవుణ్ణి చేసి ఆరాధన చేయడం జరగడం లేదూ ? ఇంతకన్న అవివేకం ఇంకేమైనా ఉందా ? తరచి చూస్తే అవివేకం కనిపిస్తుంది గాని, వివేకం అగుపించదే !

భవసాగరానికి తోడు క్షీరసాగరం అని మరొకరు ఉన్నాడు. ఏడు రకాల సముద్రాలు పెద్ద బాలశిక్షలో ఉన్నాయి. అయితే వాటిలో భవసాగరం లేదు నిజానికి. లేదేమా అని అప్పుడు టీచర్ను అడిగితే 'ఓరి వెర్రివాడా !' అని నవ్వేసి ఊరుకున్నాడు గాని దాని రహస్యం మటుకు బయటకు చెప్పలా. బహుశ ఆయనకూ తెలిసి ఉండదు. ఈ సాగరాలన్నీ కలిస్తేనే కదూ భవసాగరం అయ్యేది !

తరువాత - జాగ్రఫీ (భూగోళశాస్త్రం) చదువుతూ ఉన్నప్పుడు మరో కొత్త రకం పేర్లు పెట్టుకుని ఏడు సముద్రాలూ పునరవతరించాయి కదా ! అసలు భూగోళం అన్నాడు గాని, ఈ భూమి అంతా ఎంత గనుక ? స్కూల్లో ఉన్నప్పుడే టీచర్ బల్లమీద 'గ్లోబ్' చూచినప్పుడే రావుకు లీలగా మనసులో మెదిలింది ఆలోచన !

ప్రపంచం అంతటికీ ఈ 'గ్లోబ్' ప్రతీక అయితే, దీన్లో మూడొంతులు నీళ్లు ఒక్క వంతు మాత్రమే నేల అయినప్పుడు, దీనిని భూగోళం అని పేరు పెట్టుకోవడం ఎంత అవివేకం ! భూమి, నీరు అడపదడప పరివర్తనం పొందుతూ ఉంటే మటుకు ? మెజారిటీ అభిప్రాయానికి మన్నన లేకుండా పోయిన తర్వాత నువ్వు ఎన్ని శాస్త్రాలు చదువుకుంటూ పోతే మట్టుకేం ? సముద్రాలన్నీ అయిదని విభజించి చెప్పారు గాని - పెద్ద బాలశిక్ష నుంచి పాఠ్య పుస్తకం వరకూ - ఇవన్నీ కలిసిపోయి ఏకంగా కనిపించడంలా గ్లోబ్‌లో ? అలాగే అయిదు ఖండాలు ! అయిదా, ఆరా ? భూమిని ఎన్ని ఎన్ని ముక్కలయినా చేయవచ్చును. ఎన్ని ముక్కలయినా - మళ్లీ ఇదంతా ఒక్కటే అంటారు. 'యూనివర్స్' అంటే ఏకగీతిక కదూ !

ఈ భూమి సూర్యుడి చుట్టూ తిరగడం - ఎంత విచిత్రం ! అట్లా తిరుగుతూ ఉన్నట్లు మనకు తెలియకుండానే మనమంతా దీనితోపాటు తిరుగాడి పోతున్నామే!

తైతక్కలాడి పోతున్నామే ! ఇంతకంటే అవివేకం మరోటి ఉన్నదా ?

ప్రపంచం గుండ్రంగా ఉందా – నలుచదురంగా ఉందా – అనేది పెద్ద ప్రశ్న అయి ప్రపంచ ప్రజల్ని బాధించింది, అయినా ముల్లానసీరుద్దీన్ కొడుకు మాత్రం: ఈ రెండూ కాదు. ప్రపంచం 'క్రుకెడ్'గా ఉంది –వంకరగానూ, దుర్మార్గంగానూ – అని మానాన్న అంటాడు అని జవాబు చెబుతాడు. ఇప్పటికీ ప్రపంచం నలుచదరంగా ఉందని నమ్ముతూ ఆ నమ్మకాన్ని ప్రచారం చేస్తూ అమెరికాలో ఓ సంస్థ ఉందిట కదూ! మనిషికి దిమ్మ తిరిగి పోతోంది గాని నమ్మకాలు మాత్రం వమ్ముకావడం లేదు – ఎన్ని శకాలు గడిచినా ! ఏమయితేనేమి, ప్రపంచం ఎట్లా ఉందో నిజంగా మనకు తెలీదుగాని మాష్టారి నశ్యం డబ్బాలాగ పని రోజుల్లో ఒక ఆకారం, సెలవు రోజుల్లో మరో ఆకారం ధరించడం దానికి విధాయకం అయిపోయింది. ఇలాంటి అనివార్య విధాయకాలు ఎన్నిలేవు మనిషి చుట్టూ ! ఉన్న వాటికి ఉపరిగా మనిషి అనుక్షణమూ ఎన్ని తయారు చేసుకోవడం లేదు గనుక. ఉపరికీ ఊపిరికీ ఉన్న సంబంధం ఎవరయినా కనిపెట్టి యథాతథంగా చెప్పగలిగితే బాగుండును !

సాయంత్రం చీకటి పడుతున్నప్పుడు – చీకటి మీద పడిపోయి కొత్త వెలుగులు వచ్చి ప్రపంచాన్ని కప్పేసినప్పుడు మనిషి ఎన్నెన్ని రకాలుగా మారిపోతాడు ! ఎంతెంత దూరం పారిపోతాడు !

రోడ్డువార ఓ గుడ్డి సందును – బ్లైండ్‌లేన్ – అనుకుని చిన్న కుటీరం లాంటిది వేసుకుని అక్కడే జీవయాత్ర చేస్తున్న ముసలి దంపతులు ! ముసలి అంటే మరీ ముసలి కాదు – దౌర్భాగ్యం వల్ల, దరిద్రం వల్ల సమయానికి ముందే సహజీవనానికి వచ్చిన ముసలితనం ! ఆ ముసలివాడు – పడుచు వాడయినా ముసలివాడుగా కనబడుతున్నాడు. పెళ్ళాన్ని పట్టుకుని బాదుతున్నాడు. ఆ పెళ్లాం తిరగబడదు బలం ఉన్నా. ఒక్కనెట్టు నెడితే ముసలి వాడు నేల మట్టం అయిపోతాడు. అయినా ఆ మనిషి ఆపని చేయదేం? పోనీలే, అని భరించి, క్షమించి ఊరుకుంటుంది గావును. క్షమయా ధరిత్రీ !

ఊరుకుంటున్న కొద్దీ వాడి చేయి అదే పనిగా లేస్తోంది. ముద్దులు పెట్టుకోవాల్సిన ముఖం గుద్దులకు స్థావరం అయిపోతోంది. ఆ ముసల్ది చచ్చిపోదు గదా ! చచ్చిపోతే దాన్ని తగలెయ్యడానికి మళ్లీ ఆ శవాన్నే చూపిస్తాడు ప్రజలకు ఆ ముసలివాడు ! చచ్చిన

తరువాత కూడా వాడికి డబ్బు సంపాదించి పెడుతుంది ఆ ముసలి మనిషి - గుడ్డులు తింటున్న మనిషి! అదే మహాప్రసాదంగా ఆస్వాదిస్తున్న మనిషి!

ఆ ముసలాడిని దగ్గరకు పిలిచి ప్రపంచాన్ని గురించి తెలియ చెప్పాలనిపించింది రావుకు - ఎందుకిట్లా యాతన పడతావు ? యతనామయమైన జీవితాన్ని గడపడంలో పోతన పద్యాలు పనికివస్తాయని నీకు తెలియదా ? ఎవ్వనిచే జనించు - చదువు కోరాదూ ? ఈశ్వరుడిని శరణు వేడుకుంటున్నావుగా ప్రతిరోజూ.

ఇంటి దగ్గర మాత్రం 'హింస' చేస్తాడు, పెడతాడు ! ఇంకా ఈ గుంజాటనలన్నీ ఎందుకుట ?

పోనీలే వేదాంతం వద్దు - తోటి జీవిని ఎందుకయ్యా హింసిస్తావు ? అహింసే పరమధర్మం - అదుగో మళ్లీ 'ధర్మం' అని తత్త్వ దర్శనం తీసుకు వస్తున్నావు.

ఈ ముసలివాడు - కనీసం అలా కనిపిస్తున్నవాడు - చిన్నప్పుడు బడికి వెళ్లలేదు. సుమతీ శతకం చదువుకోలేదు. తన శాంతమే తనకు రక్ష - అని అతడికి తెలియదు. కోపమూ, చూసోపమి కాపురషలక్షణాలని చిన్నయ సూరి చెప్పిన సంగతి ఇంకా ఇతడికి అందలేదు. జీవితాన్ని కులాసాగా విలాసంగా గడిపి వేయడం కంటే - గుంజాటనగా బతుకుభారంతో నడ్డి వంగి విరిగి వికృత రూపం పొందడమే విధాయకం అయి పోయిందా ఇతడికి ?

జీవిత సూత్రాలన్నీ విడమరచి చెప్పడం ఎట్లా ?

కడుపు కాలుతున్న వాడికి తత్త్వం తెలియక పోవచ్చు గాని - తత్త్వం తెలియని వాడికి కడుపు కాలకుండా నిలుపుకోవడం, నింపుకోవడం - ఎలాగో సుతారమూ తెలియదు.

ఆ ముసలివాడు తత్త్వాలు పాడతాడు మళ్లీ. గుడి దగ్గర మెట్ల మీద కూర్చుని వచ్చే పోయే వాళ్లను వేధిస్తూ 'భిక్ష' అడుక్కుంటాడు. యాత్రికులకు పుణ్యం సంపాదించుకునే సులభసూత్రం ఆదేశిస్తున్నాడు.

తనమాట వినని వాళ్లను తిట్టుకుంటాడా ? బాహాటంగానే తిట్టి పోస్తాడా ? ఇంటి దగ్గర మాత్రం హింస చేస్తాడు, పెడతాడు.

'నువ్వు కూడా నాలుగు వీధులు తిరిగితే పట్టెడన్నం దొరక్కపోయిందా ?' -

అని వేధిస్తాడు. 'నేను తిరగను. నువ్వు తెస్తే తింటాను. కాదు. చేతనయినన్నాళ్లు వళ్లు వంచి కష్టపడి సంపాయించి తిన్నాను, నీకు పెట్టాను. ఇప్పుడు నా వల్ల కాదు. కొట్టు, గుద్దు, చీలికలు చెయ్యి. వాలికలు చెయ్యి - అంటున్న కొద్దీ ముసలివాడికి రోషం ముందుకు వస్తుంది.

నన్ను అడుక్కు తింటున్నానంటావా ? - ముష్టివాడినని ఎద్దేవా చేస్తావా ? - బలికి చెడ్డానని బేలగా చూస్తావా ? - చెడిగూడా బతుకు తున్నాను గదూ ! బతకడం కంటె తీపి భాగ్యం ఇంకేం ఉందీ - జానెడు పొట్ట నింపుకోవటానికి జాము పొద్దునా నోరంతా తెరిచి అడిగినా చాలడం లేదే !

- ముసలి వాడి బాధ భార్యకు అర్థం కాదు. అర్థం అయ్యేట్లు చెప్పడం వాడికి చేత కాదు. అసలు వాడికయినా అర్థం అయిందో లేదో !

ఇద్దరినీ కూర్చోబెట్టుకుని, 'కౌన్సెలింగ్' చేస్తే ఎంత బాగుంటుంది ! - రావుకు ఏం చేయాల్సిందీ తేల్చుకునే లోపలే ఆ దంపతులు దీపం ఆర్పేశారు.

ఆ రెండు రూపాలూ మనసుకు తెచ్చుకుంటున్నాడు రావు.

ఒంటికి సరీగా అమరీ అమరని బట్టలు. శుచీ, శుభ్రమూ అంతగా పట్టించుకోని శరీరం. రోజూ గడ్డం చేసుకోవాలనే ఇంగితం లేని వయసు ముదిరిపోయిన మనిషి. గడ్డం పెరిగినకొద్దీ జీవితంలో అనుభవం ఎక్కువ సమకూడుతుందా ? గడ్డం బారుగా పెరిగిన మునులు. వంటిమీదే పుట్టలు, చెట్లు పెరిగినా గమనించని వాళ్లు - అలాంటి వాళ్లను ఈ రోజున ఆదిపురుషులని పూజిస్తున్నాంగా ! ఈ మనిషికి మటుకు ఏం లోటు ? ఏం తీపు దిగదీసింది ?

నదీతీరంలో ఉండి ప్రతిరోజూ ముప్పొద్దులా స్నానం చేసి - దేవుళ్లకు త్రికాలాల లోనూ జల అర్ఘ్యాలు ఇచ్చి, ఎవరో తనను పట్టుకు వేళ్లాడుతున్న స్త్రీ వంట చేసి కడుపు నిండా రుచిగా మెక్కపెడుతూ ఉంటే భోగ్యంగాతిని, తపస్సు చేసుకుని ఏదో వెదుకుతున్నానే ధ్యాసలో సమయం అంతా గడపేసిన వాళ్లు - జనానికీ బతుకు లో బాధలు భయాలకూ దూరంగా ఉన్న వాళ్లు - జనం సుఖం కోసమే ఇదంతా చేస్తున్నా మని భ్రమల్లో పడి ఇతరులకూ ఈ భ్రమ మత్తు అందిస్తున్నవాళ్లు - వీళ్లందరూ పుణ్య పురుషులయి పోయి - ఈ ముసలివాడు మాత్రం వేరయిపోతాడా ? అతడి

భార్య మాత్రం దెబ్బలు తింటూనే ఉంటుందా ? వీళ్లకు అనివార్య అపౌరుషేయాల గురించి ఎవరయినా ఉపదేశాలు ఇవ్వాలా ?

ఆది దంపతులే ఇక్కడ ఇలా అవతరించారేమో ! తమ ప్రపంచం ఎలా సాగుతోంది, గడుస్తోంది అనేది చూస్తూ కేవలం 'సాక్షీ' భూతంగా ఈ ఇబ్బందులు అనుభవిస్తున్నారేమో ! అది వాళ్లకు ఇబ్బందులు కావేమో ! చూచేవాళ్ల కళ్లల్లోనే గదూ అంతా ఉండేది? అందం అయినా, చందం అయినా, లాలస అయినా, లావణ్యం అయినా !

వాడు చాల కష్టపడి పోతున్నాడు - అనుకుంటాం. అది కష్టం అని వాడికి తెలియదు, ఎవరయినా నూరిపోస్తే తప్ప.

పదేళ్ల అమ్మాయి మూడేళ్ల కుర్రాడిని చంకన వేసుకుని కొండ ఎక్కుతుంటే చూచిన వాళ్లు ఏమనుకున్నారు ? బరువు కదూ - అని ఊరడించలేదూ ?

'బరువా? వీడు నా తమ్ముడు' - అని ఆ పిల్ల వాళ్లందరి నోళ్లూ కట్టెయ్యలేదూ? మనస్సులు కొత్త ఆలోచనలతో నింపి హృదయాలు తెరుచుకునేట్లు చేయలేదూ ?

ఆ పిల్లకు ఎవరు చెప్పారు, ఈ సంగతి ? ఆ పిల్లను ఎవరు కన్నారు ? విన్నవాళ్లంతా విస్తుపోయేట్లు మాట్లాడిందే !

'నిన్ను చంపేస్తాను' - అని కోపంగా అన్నవాడు నిజంగా చంపేస్తాడా ? - ఆ ముసలివాడు ! ఇక్కడు హత్య జరగబోతోందని పోలీసు వాళ్లకు చెప్పకుండా ఉండడం తప్పిదం అవదుగదా రేపు ! విన్నా విననట్లుగానే ఉండిపోవడం ఎంత కష్టం !

రావు దుస్తులు నలగకుండా ముందుకు నడచిపోతున్నాడు. జేబులో గడియారం టిక్-టిక్‌మని వరుస ప్రకారం చప్పుడు చేస్తూనే ఉంది.

గడియారం చేతికి పెట్టుకోవడం మామూలు. అందరూ ఎక్కువగా ఎడమ చేతికే పెట్టుకుంటారు, కొందరు మాత్రం కుడిచేతికి. రావు మటుకు జేబు గడియారమే ఉపయోగిస్తాడు. జేబు గడియారాలకు ఈ రోజున 'ఆర్క్యాయిక్ వాల్యూ' ఉంది తప్ప ఇంకేం లేదు. అయినా తాతగారిని అంటిపెట్టుకు ఉన్న ఈ గడియారం తన జేబులోనూ పదిలంగా ఉండి 'కొత్త పాతల మేలుకలయిక'లకు దోహదం చేయాలని రావు సంకల్పం.

సమయం చూచుకోవలసిన సందర్భం రాకపోయినా చేతికి గడియారం కట్టుకు తిరగడం జనానికి అలవాటు అయిపోయింది. దాని 'యుటిలిటీ' కాదు - అలంకార

ప్రాయం మటుకే లెక్క

గడియారం కొట్టుకుంటుంది - మనిషికి గుండె కొట్టుకుంటున్నట్లుగా. లబ్-లబ్. గడియారం మటుకు టక్-టక్. దీనికీ యేదో మెయిన్ స్ప్రింగ్ ఉంటుంది లోపల, మనిషికి గుండె కాయ ఉన్నట్లుగానే. పైకంతా ఒకటే వస్తువుగా కనిపిస్తున్న గడియారం లోపల ఎన్ని చిన్న చిన్న భాగాలు -- చక్రాలు - తీగలు, శీలలు - వజ్రాలు. రోజూ ప్రాణం పోస్తున్నట్లుగా దీనికి 'కీ' ఇస్తూ ఉండాలి. లేకపోతే చెప్పకుండా చెయ్యకుండా ఆగి పోతుంది. మనిషి శరీరం కూడా ఇంతే కదూ ! పోషణ, పాలన చేస్తూ ఉండాలి. చర్మం పైకంతా కప్పి ఉంచుతుంది గాని లోపల ఎన్ని శరీరాలు ఉన్నాయి ? నరాశయం అంతా ఒక శరీరం. రక్త ప్రసరణ కాలువలు ఒక శరీరం. అన్నవాహిక నుంచి జీర్ణకోశం - పెద్ద పేగులు - చిన్న పేగులు ఇదంతా ఒక శరీరం. ఇలా ఏడు శరీరాలు ఉన్నాయట ! గడియారానికి ఏదేనా ఒక భాగం పోతే - చెడినా విరిగినా కొత్త భాగం వేసినట్లే మనిషి శరీరంలో కూడా ఏ భాగం పోయినా దాన్ని రీప్లేస్ చేయవచ్చు. గుండెలు తీసిన బంటు అంటారుగాని - గుండెకాయను మార్చివేయడం లేదా ఇప్పుడు ? మూత్రపిండాలు, కీళ్లు, కాళ్లు.- కొత్తవి తగిలించడం ఏనాడో పాతబడిన సంగతి. ప్లాస్టిక్ సర్జరీ చేసి శరీర రూపలావణ్యాలనే తారుమారు చేసేస్తున్నారు. జెనెటిక్ ఇంజనీయరింగ్ వచ్చేస్తే - ఇంకా బాగా వ్యాప్తిలోకి వస్తే - ఇంకేమయినా ఉన్నదా ? గలివర్ చూచిన దీర్ఘబాహులు, లిల్లిపుట్లు, గుర్రం ముఖం వాళ్లు - రామాయణ కాలంలో కబంధులు, తాటకులూ ఏ మూలకు పనికి వస్తారు ? ఇప్పుడు కూడా ఇలాంటి వాళ్లు ఉన్నారేమో. మనకు రోజూ కనిపించకుండా చీకట్లో దాక్కొని ఉంటారేమో ! ఈ ప్రపంచం నడవటానికి ఇలాంటి వాళ్లందరూ తప్పనిసరిగా కావాలేమో !

ఆకాశంలో నక్షత్రాలు కనిపిస్తున్నాయి. ఆ నక్షత్రాలకు సవాలక్ష పేర్లు. నక్షత్ర మండలాన్ని గురించి ప్రత్యేకించిన పరిశీలనలు, శాస్త్రాలు, - దాన్ని పరిశీలిస్తూ కూర్చోవటానికి ఎన్నో లాబొరేటరీలు. సౌరకుటుంబం అంతా నీకు టెలెస్కోప్‌లో చూపించే ప్లానెటేరియంలు ఇప్పుడు ప్రపంచం అంతటా విస్తారంగా ఉన్నాయి. ఈ నక్షత్ర మండలం లేకపోతే సృష్టికి లోపం ! - ఈ ముసలివాడు, వాడి భార్య కూడా ఈ సృష్టిలో భాగం, తప్పనిసరి భాగం ! వాడు లేకపోతే - ఆ సంసారం లేకపోతే -

ఇంకేమన్నా ఉందా ? అంతవరకూ అది లోపమే.

నక్షత్రం చేతికి అందదు. దాన్ని ఆడించడం మటుకు నీకు చేతనవుతుంది. ఇక్కడో పాద కదిలించు - అక్కడి నక్షత్రం కూడా కదలబారుతుంది - అన్నాడు కదూ ఒక భావుకుడు ! ప్రపంచం అంతా - బ్రహ్మాండం అంతా - ఒకదానితో ఒకటి - ఒరిసిపోయి కలిసిపోయి విడదీయటానికి లేకుండా - అతుక్కుపోయి ఉంది. ఇక్కడ పిపీలికానికి యేమయినా అయితే అక్కడ బ్రహ్మపదార్థం వరకూ స్పందన, అను స్పందన, ప్రతిస్పందన తప్పదు గాక తప్పదు.

ముసలివాడు చొక్కా తొడుక్కోకపోవటానికి కారణం ఏమిటి ? వాడు గడ్డం ఎందుకు గీసుకోడు ? తాను మాత్రం మనిషంత బరువు వస్తువులూ దుస్తులూ వంటి మీద లేకుండా బయటకు రాడే ! పొద్దున్న, సాయంకాలం కూడా గడ్డం గీసుకుని 'ఆఫ్టర్ షేవ్ లోషన్లు' అలుముకుంటాడే ! ఆర్థిక రాజకీయాలా ఇందుకు కారణం? సాంఘిక సామాజిక స్థితిగతులా ఇందుకు ప్రేరణం ?

మరోసారి ఇంకెవడో కనిపించాడు.

దొంగతనం చేశాడు. ఎదురుగ్గా వస్తున్న మనిషిచేతిలో ఉన్న సంచి అమాంతం లాక్కుని పరుగు లంకించుకున్నాడు. అంతవరకు సంచి చేత పట్టుకున్న మనిషి - అతనే దానికి యజమానో, లేక అప్పుడే ఎక్కడైనా తానూ దొంగతనం చేసి తెస్తున్నాడో ! - నిర్ఘాంతపోయి నిలుచుండిపోయాడు గాని గట్టిగా నోరు తెరిచి కేక వేయ లేకపోయాడు. లిప్తలో అయిపోయింది. రోడ్డుమీద ఎవరి దారిన వాళ్లు వెళ్లుతున్నారు గాని ఈ విపర్యయం ఎవరూ గమనించ లేదు. ఎవరెట్లా పోతే ఎవరికి కావాలి ? ఆ మనిషి అరిచి ఉంటే అందరూ ఉలిక్కిపడి ఈ సంఘటన మీద చిలువలు పలువలు అని ఉండేవాళ్లేమో ! రావు మాత్రం చూచాడు. తీరుబాటుగా గమనించాడు. దొంగి లింపబడిన వాడిని - వాడూ దొంగేనని ఇదివరకే అనుమానం వచ్చింది గనుక - పరామర్శించలేదు; ధైర్యం చెప్పలేదు. పోయిన వస్తువులు రాబట్టుకునే ప్రకారం గురించి ప్రబోధించ లేదు.

'ఛెయిన్ స్నాచింగ్' కేసులు రోజూ ఎన్ని చూస్తున్నాం - వార్తా పత్రికలలో. అంత మాత్రంతో ఆడవాళ్లు బంగారు గొలుసులు వేసుకోకుండా ఉంటారా ? పమిట

కొంగులు పూర్తిగా కప్పుకుంటారా ? పోయిన సొమ్ముల కోసం పోలీసు రిపోర్టులు ఇవ్వ కుండా ఉంటారా ?

పోలీసు !

దొంగతనం చేసినవాడు తరువాత ఎప్పుడో తనకు కనిపించాడు. 'ఎవరికీ చెప్పకు. నువ్వే చూచావని నాకు తెలుసు. చెప్పావంటే ఏం చేస్తానో నాకే తెలియదు' అని బెదిరించాడు.

పోలీసుకు చెబుదాం అన్న ఉత్సాహం కాస్తా కొండెక్కిపోయింది. ఈ దొంగ మనస్సు ఎలాంటిది ? దొంగతనం చేయడం తప్పని తెలియని మనసా ? దొంగతనం చేయడం తప్పనిసరి అయిన బతుకా ? వాడి కళ్లు నక్షత్రాల మోస్తరుగా మిలమిల మెరుస్తున్నాయి. ఆకాశంలో నక్షత్రాల తళతళ ! దొంగవాడి కళ్లు మాత్రం మిలమిల ! తెలతెలపోయి చూడడం తప్ప తనకు ఇంకేం చేతకాలేదు. దొంగతనం జరుగు తున్నప్పుడు చూచీ - దొంగను విడిగా చూచీ కూడా !

నక్షత్రాల తళుకు వాడి కళ్లల్లోకి ఎట్లా వచ్చింది ?

ఒట్టి దొంగవెధలకే సుందర వదనార విందం ఉండటం.సబబా ? తప్పు చేస్తున్నానని అతనికి తెలిసే ఉంటుంది. ఆ మాత్రం తెలియకుండా ఉంటాడా ? ఎవరయినా పట్టుకుంటారేమోనని పరుగెత్తాడు. పరుగెత్తి పోయినవాడు సంచీ అవతల ఎక్కడో భద్రపరచుకుని తిరిగి వచ్చి మరీ బెదిరించాడు. అప్పుడు ఒకవేళ తాను బుద్ధి కుదిరి పోలీసులకు చెప్పినా - వాడిచేతిలో సంచి లేదు. దొంగ వస్తువు దగ్గర లేనప్పుడు ఎవడూ దొంగ కాదు. నీ దగ్గర ఓ వస్తువు ఉంటే దాన్ని నువ్వు దొంగతనం చేయక పోయినా, పోలీసు పట్టుకుంటే నువ్వు దొంగవే !

దొంగ - పోలీసు ఆట భలే తమాషాగా ఉంటుంది.

సాక్ష్యం - ఆధారం దొరికితే తప్ప నిన్ను ఎవరూ ఏమీ చేయరు. ఫిర్యాదు చేయడం తో చాలదు. దొంగను కూడా పట్టి ఇవ్వాలి. అప్పుడూ శిక్ష. సాక్ష్యం, ఆధారం అన్నీ నువ్వే కూర్చుకుని తెచ్చి ఇవ్వాలి. లేకపోతే నీది తప్పుడు ఫిర్యాదు అయిపోతుంది. అందరికీ విరోధం అయిపోతావు. తప్పు చేసిన వాడు మాత్రం ఆనందంగా ఉంటాడు. ఎవరూ పట్టుకోలేదు గనుక - ముట్టుకోలేదు గనుక - మహరాజులాగ చొక్కా 'కాలర్'

ఎగరవేసుకుంటూ తిరుగుతాడు. నక్షత్రాల కాంతి వాడిలో మూర్తి మంతం అవుతుంది. నక్షత్రాలు - నఖ క్షతాలు - ఎవరివో అంత పెద్దగోళ్లు. ఆకాశం నీలిరంగులో భూమి నంతా ఆవరించుకుపోయి ఉన్నప్పుడు ఎవరో రాక్షసగోళ్లతో చిల్లులు వేశారు. నక్షత్రాలు బయటపడ్డాయి. ఆకాశంలో రంధ్రాలే నక్షత్రాలా ? ఆకాశానికి అవతల ఉన్న వెలుగు ఈ రంధ్రాలలోంచి భూమి మీదకు తొంగి చూస్తోందా ? చంద్రుడు మరింత పెద్ద చిల్లు. ఇవన్నీ వెలుగుల కలుగులు !

చిల్లులయితే మాత్రమేం ? చూడటానికి ఎంత అందంగా ఆకర్షవంతంగా ఉంటాయి నక్షత్రాలు ! వాటి వెలుగులో నగరం తీరే మారి పోతుంది. స్వర్గంలో ఉన్నట్లు ఉంటుంది - రాత్రి పూటలు. పగటి వెలుగుకంటే - నక్షత్రాల కాంతి; విద్యుద్దీపాల వెలుగు రాత్రిపూటలు నగరం తీరు తెన్నులనే మార్చివేస్తాయి గదూ ! ఆ వెలుగులో షికారు తిరగాలంటేనే ఎంతో ఆనందంగా ఉంటుంది. వెయ్యి ఏనుగులు ఎక్కినంత ఉత్సాహంగా ఉంటుంది మనస్సుకు. ఇంకెవ్వరి తోడూ అక్కర్లేదు. నక్షత్రాల, దీపాల వెలుగులో ఎంతసేపయినా హాయిగా ఉండవచ్చును. ఇంకెవ్వరి తోడూ అక్కర్లేదు. ఎవరూ నియామకం చేయరు. ఇంతకంటె ఇంకేం ఆనందం కావాలి ? మనస్సు, ఈ ప్రపంచమూ ఉంటే చాలు - ఇంకేం అక్కర్లేదు.

అలా అనుకుంటాడు గాని ఆలోచనలు వచ్చి ముసురుకుని అతన్ని అతలాకుతలం చేస్తాయి, చెప్పీ చెప్పకుండానే. వింత వింత ఆలోచనలు. అటువంటి ఆలోచనలు ఈ ప్రపంచంలో ఉన్నాయని ఎవరేనా చెబితేనే నమ్మటానికి వీలుకానంత వింత ! ఈ ప్రపంచం, ఈ వస్తు సముదాయం, సంవిధానం, ఈ ఆహ్లాదానికి హేతువయిన విశాల విశ్వం - ఇదంతా నిజం కాకపోతే ! లేక ఏదో నిజానికి నీడలాంటిది అయిపోతే ! నిజమూ - నీడ కలిసిపోయి నిలువెల్లా ప్రతిబింబిస్తున్న జాడ అయితే! దేన్నీ నమ్మటానికి లేదు. దేనినీ ఆధారం అనుకుని ఆశ్రయించుకు ఉండటానికి లేదు - నిజంగా కనిపిస్తున్న ఈ వస్తువులన్నీ అబద్ధాలు అయిపోతాయా ? ఈ వీధులు, ఈ వెలుగులు, ఈ ముసలి బిచ్చగాడు, అతని భార్య, వాళ్ల పోట్లాటలు, ఏడుపులు - పెడబొబ్బలు, దొంగతనం చేస్తున్నవాడు - వీళ్లు ఎవరూ లేకపోతే ఏమయి పోతుంది ? వీళ్లంతా కనబడకుండా పోతే తన బతుకు ఏమయిపోతుంది ? కళ్లకెదురుగా కనిపిస్తున్నదంతా

మటుమాయం అయిపోతే ఇంకేమయినా ఉందా ? అంతా మాయ ! అంతా అబద్ధం! అంతా నటన ! ఉన్నట్లుగా ఉంది గాని నిజంగా లేదు. ఉన్నదనటానికి కావలసిన సాక్ష్యం కనిపించదు. ప్రతి దానికీ వెదుక్కోవలసిందే. ఛప్పున, కావలసినట్లుగా, అనుకున్న తీరులో కనిపించకపోతే - ఈ ఆలోచనలన్నీ ఏమయిపోతాయి ? ఆవిరిగా మారిపోతాయా ? ఆకాశంలో కలిసిపోతాయా ? మనస్సు చీదరించుకున్నట్లు అయిపోతుంది. చికాకులన్నీ అకస్మాత్తుగా తొలగిపోయినట్లు అవుతుంది. అప్పుడు ఇంకేమీ లేదు. ఈ విశాల విశ్వంలో తను ఒక్కడే ! ఎక్కడ చూచినా 'రావు' ఒక్కడే ! విశాల విశ్వం అంతా తనే ! ఇంకా ఇతర వస్తువులు, పరస్పర ఆశ్రయం, పరుగులు - ఉరుకులు ఇవేవీ లేవు. తన మీద తాను ఆధారపడితే చాలు; ఇంకేం వెదకవలసిన పని లేదు. తన స్వరూపమే విశ్వంగా, విశ్వమే - తన స్వరూపంగా రూపాంతరం పొంది - సమాంతరంగా వెలిగిపోతుంటే, మెలుగుతూ ఉంటే ఇంకా ఇతర విషయాల కోసం, వస్తువుల కోసం వెదకవలసిన అవసరం ఏముంది ?

నడుస్తూ ఉన్నప్పుడు హుషారుగా చేతులు అటు, ఇటు ఆడతాయి. కాళ్లు వాటికి తెలియకుండానే, ప్రత్యేక ప్రయత్నం లేకుండానే ముందుకు తీసుకు పోతాయి - ఈ శరీరాన్ని, ఈ ప్రపంచాన్నీ అంతటినీ ! చెవులు - ఏం వినబడుతుందా, ఈ చప్పుళ్లకు ఏం అర్థం చెప్పుకుందామా - అని దోర పెట్టుకు కూర్చుంటాయి. కళ్లు ముందున్న విరామాన్ని విశ్రాంతిని తీరుబాటుగా తనివితీరా చూస్తూ ఉంటాయి. గాలి పీలుస్తున్నంత సునాయాసంగా తెలియకుండానే క్షణాలు కరిగిపోతాయి. వాసనలన్నీ కమ్ముకుని హృదయాన్ని బరువుగా నింపుతాయి. వీటిని తాకిన చర్మం మెత్తగా తయారవుతుంది- ఒక్కోమారు. మొద్దుబారి పోతుంది మరోమారు. ఒక్క క్షణం ఉన్నట్లు మరుక్షణం ఉండదు. క్షణక్షణాభివృద్ధి పొందుతున్న ఈ విశ్వం అంతా అబద్ధమేనా ? లేక తనే దీన్ని తీసుకుని, ఇంకెవరికీ ఏమీ మిగలకుండా, దడదడ ముందుకు సాగిపోతున్నాడా?

అలెగ్జాండర్ కదూ అతను ? చేతులు బయటకు చాచి మరేం పట్టుకు పోవడం లేదని ఇతరులకు సాక్ష్యంగా చూపిస్తూ మరో ప్రపంచంలోకి వెళ్లిపోయాడు !

ఏవి తీసుకు వచ్చినా, ఎంత తోసుకు వచ్చినా - చివరకు - ఆ క్షణం వచ్చేసరికి అంతా అంతర్ధానం అయిపోతుందా ? తానే అంతరిక్షంలో కరిగిపోతాడా ? అప్పుడే

మయిపోతుంది ? నడుస్తున్న వాడిని ఎవరో భుజం తట్టి నిలుపుతున్నారు, చేయిపట్టి అటకాయిస్తున్నారు. రావు ఆగిపోయాడు. సాగిపోతున్నవాడు ఆగిపోవటానికి కారణం- ఓ పోలీసు ! అటకాయిస్తున్నవాడు పోలీసు ! ఆ దుస్తులే చెబుతున్నాయి. మారుపడటానికీ మరచి పోవటానికీ లేదు.

ఆటకాయతనంగా తనను అడ్డగించి 'ఎవరు నువ్వు? ఇంత రాత్రిపూట ఇక్కడెందుకు తిరుగుతున్నావు ? ఇల్లూ వాకిలీ లేవా ? హాయిగా ఇంత తిని, మంచం మీద పడుక్కుని మరులుపోతూ ఉండక ఇంకా మేలుకునే ఉన్నావు, ఎందుకని ?అని ప్రశ్న పరంపరలు వేస్తున్నాడు. జవాబు కోసం ఆగడం లేదు. జవాబు అక్కర్లేదు అన్నట్లుగా ఒకదాని తర్వాత ఒకటి ప్రశ్నలు బాణాల లాగ వదులుతున్నాడు. చేయి మాత్రం ఇంకా పట్టుకునే ఉన్నాడు. కళ్లు మాత్రం చింతనిప్పుల్లా లేవుగాని, చింతతో వింతగా చికిలించుకు పోయి ఉన్నాయి.

ఎవరు నువ్వు ?

విశ్వం అంతా తానే అయిన నన్ను పట్టుకుని ఎవరు నువ్వు - అంటే ఏం జవాబు చెబుతాను ? - నేను ఎవరు ? నువ్వు ఎవరు ? నాకు 'నేను' అయినా నీకు 'నువ్వే' అవుతున్నాను. నేను ఒక్కడినే కాదు. ప్రతి వాడూ ఇంతే కదూ ! ఎంత ఉత్తమ పురుషుడయినా ఇతరుల దృష్టిలో మరేదో అయిపోతాడు.

'నేనా ? నేను ఎవరూ కాదు. ఆలోచించడం తప్ప ఇంకేం చేతకాని మనిషిని. సదా చింతనతో సత్ చింతనతో కాలానికి కట్టుబడి పోకుండా స్వతంత్రంగా సావకాశంగా తిరుగుతూ ఉన్నవాడిని ! - అని సమాధానం చెప్పాడు.

పోలీసు అతని వంక మరింత అనుమానంగా చూచాడు. అయోమయంగా చూచాడు. ఆత్రంగా - వెదుకుతూ అస్తవ్యస్తంగా చూచాడు. చేయి వదిలాడు. దుస్తుల డాబు గమనించాడు. జేబు గడియారం హొయలు పరికించాడు. కాస్త కదల బారాడు పోలీసు.

'ఎవరో అనుకున్నాను. అయినా ... మీరు ఆ అమ్మాయిని వెంబడిస్తున్నారేమోనని భయపడ్డాను. అయినా ... ఆమెను వెంటాడడం లేదు గదూ మీరు ? నిజం చెప్పండి- అన్నాడు - అడుగుతున్నట్లుగా ఒకమారు; ప్రాధేయపడుతున్నట్లుగా మరోమారు.

అమ్మాయి ఎవరు ? ఎక్కడా కనిపించదేం ?--.

క్షణమో - రెండు క్షణాలో నివ్వెరపోయి చూచాడు రావు. తన వంక, పోలీసు వంక, చుట్టూ ఉన్న పరిసరం వంక. అప్పుడే పెదుకులాట ఆరంభించిన వాడి మాదిరిగా చూచాడు. 'ఎవరు - అమ్మాయి ఎక్కడ ?-' అనడిగాడు చివరకు నోరు విప్పి.

'మీకంటే ముందు - నూరు గజాల దూరంలో కనిపించిందే, ఆ అమ్మాయి, గులాబీ రంగు చీర కట్టుకుంది. జడలో గులాబీలు, ఇంకా ఏవో పువ్వులు తురుము కుంది. కాస్త భయపడుతున్నట్లుగా అడుగులు తడబడుతూ నడుస్తోంది. మీరు చూడలేదా ?' అన్నాడు పోలీసు.

చూడలేదని చెప్పకుండానే చెప్పాడు రావు.

'మీరు చూచారనుకున్నాను. ఆమె కోసమే మీరు ఇలా వెంబడించి పెడుతున్నారని అభిప్రాయానికి వచ్చాను. మీరు వెనకాల వస్తున్నారనే ఆమె అడుగులు తడబడి నడుస్తోందనుకుని మిమ్మల్ని నిలిపాను -' ఏమిటో సంజాయిషీ చెబుతున్నట్లుగా చెప్పుకు పోతున్నాడు పోలీసు.

ఇంకా అన్నాడు : 'అసలు ఆమెనే ఆపుచేసి ప్రశ్నలు వేద్దాం అనుకున్నాను. ఆడ మనిషి ఒక్కర్తే ఎక్కడకు పెడుతోంది ? వెనుక ముందు ఎవరూ తోడు లేరా ? భయం అనిపించడం లేదా ? అసలు - భయం వల్లనే అలా ఒంటరిగా వెళ్లిపోతోందా ? - ఎన్నో ప్రశ్నలు వేద్దాం అనుకున్నాను. అయినా ఒంటరిగా పెడుతున్న ఆడపిల్లను ప్రశ్నలు వేస్తూ నించుంటే ఎన్నో అపార్థాలు వస్తాయి, అనర్థాలు ముందుకు వస్తాయి. పోనిద్దాం. తరువాత ఏమయినా ముందుకు వస్తే అప్పుడు చూచుకుందాం - అనుకుని వదిలేశాను. మీరు కనిపించారు. అందుకనే మిమ్మల్ని ప్రశ్నలు వేస్తున్నాను. ఇంతకూ మీరు ఆ అమ్మాయిని వెంబడిస్తున్నారా ? వెంబడించడం లేదు గదూ, చెప్పండి-'

రావు ఏమీ బదులు చెప్పలేదు. ఏం చెప్పదామా అని ఆలోచించాడు. ఏమీ లేదు, అంతా అబద్ధం అనుకున్నప్పుడు ఈ పోలీసు కనిపించాడు. పోలీసు వేషధారి. ఇతనికే చెబితే ఎలా ఉంటుంది. ఈ ప్రపంచం అంతా ఓ నాటక రంగం; మన మందరమూ పాత్రధారులం. క్షణక్షణమూ అనేక పాత్రలు ధరిస్తూ, అపాత్రంగానూ పాత్రత ఎరిగీ, ప్రవర్తిస్తూ ఉంటాం. మనను చూచే మనం భయపడుతూ ఉంటాం. భయాన్ని చూచీ

భయపడతాం - బాధపడతాం. బాధలను తీయగా మలుచుకుంటాం. తీపిని ఆహ్లాదంగా అమృతం అనుకుంటాం - ఇదంతా ఆలోచించావా, పోలీసూ - ఎప్పుడైనా ? అని అడిగేద్దాం అనుకున్నాడు రావు.

అవును. ఒకటికి రెండు బుర్రలు కలిస్తే మంచిది. ఒకరికి తోచనిది రెండో మనిషికి తోచవచ్చు. ఆ రెండో మనిషి మూడో మనిషిని కూడా తీసుకు రావచ్చు. ఇల్లా సమాజం విస్తృతంగా పెరిగితే భూమి అంతా బరువుగా బాధ్యతగా ముందుకు పోవచ్చు.

ఆలోచించడం, వెదకడం ఒకటేనా ?

పోలీసుకు ఆలోచించడం చేతకాదు. తనకు ఆలోచించడమే అలవాటు. ఆలోచించకుండా ఉండడం చేతకాదు. పోలీసు వెదుకుతాడు దొంగ కోసం, వెదుకుతూనే ఉంటాడు, ఆలోచన కోసం కాదు. దొంగ - ఆలోచన - ఈ రెండూ ఒకటేనా ? పోలీసు దొంగ కోసం, తను ఆలోచన కోసం ! విస్తృతంగా పరుచుకున్న ఈ విశ్వంలో అంతులేకుండా ఎదురుచూస్తూ ఎప్పుడయినా కలుసుకోవటానికి సిద్ధ పడుతూ తిరుగుతున్నారా ?

పోలీసుకు ఏమయినా చెప్పవలసిందే. ఈ విశ్వం : ఇది పరుగెత్తే తీరు : వికాసం కోసం మనిషి పడుతున్న యాతన ...

గ్రహణం పట్టిన చంద్రుడు; పాణిగ్రహణం చేసుకున్న ఇంద్రుడు. పరుగు తప్ప నడక చేతగాని పడుచు పిల్ల. పడుచుకోసం పరుగెత్తుతూ పడుతున్నా లేస్తూ ప్రయాణం చేస్తున్న గడుసువాడు. పడుచుతనాన్ని మేలి ముసుగులా కప్పుకున్న ముసలితనం. కాయకష్టం చేయలేక ముష్టెత్తుకోవడం - ముద్దులతో గడపాల్సిన సమయాన్ని గుద్దులతో ...! ఇదంతా పోలీసుకు చెప్పవలసిందే. అతనికి ఈ పరిణామం అంతా అర్థం కావాలి. లేకపోతే వెదుకుతున్న దొంగ దొరకడు. జీవిత నవనీతం అందదు. వెన్నదొంగ, వన్నెల రేడు. ఇద్దరూ ఒక్కరే అయినా - ఒక్కడేనని అతనికి అర్థం అయేట్లు చెప్పడం ఎలా ?

పాము - పగ ఒక్కటే అనుకుంటున్నాడు గాని, పగ పగ్గంలోంచి వచ్చిందని పోలీసుకు ఎలా అర్థం అవుతుంది ? - రావు ఇంకా ఆలోచిస్తూ ఉండగానే పోలీసు ముఖకవళికలు మార్చుకుని - 'పోనీండి, మీరు వెళ్లండి. అయినా ఒక సలహా ఇస్తాను,

మీరు ఏమీ అనుకోకండి -' అంటూ మొదలుపెట్టాడు.

ఎవడు తన దగ్గరకు వచ్చినా సలహా కోసమే వస్తాడని, సంప్రదించి సంసారం చక్క దిద్దుకుందుకు చూచుకుంటాడని ఊహలో ఉన్న రావుకు - పోలీసు సలహా ఇస్తానంటున్నాడు. ఇవ్వనా, వద్దా - మీకు కావాలా, అక్కర్లేదా అని అడగకుండానే సలహా ఇచ్చేస్తున్నాడు. ఒక్కసలహా అని మొదలుపెట్టి అనేకం చెప్పాడు. ఏకం అనేకం!

- రాత్రిపూట అట్టే సేపు బయట తిరగకండి.

- ఎలాంటివాళ్ళు తిరుగుతూ ఉంటారో మీకు తెలీదు.

- తరువాత అనుకుని ఏం లాభం లేదు.,

- మన జాగ్రత్తలో మనం ఉండడం తప్పని సరి.

- నివారణం కన్నా నిరోధం మంచిదన్నారు గదూ, మీలాంటి పెద్దలే.

- నేను ఉన్నాను గనుక సరిపోయింది. లేకపోతే - ఉదాహరణకు - ఆ అమ్మాయే మీకు వలవేసేది. వెలకు వచ్చే వాళ్ల కోసం మీరేం కాచుకు లేరని నాకు తెలుసు గనుక సరిపోయింది. తరువాత విలవిలలాడి ప్రయోజనం లేదు చూడండి -

- ఎందుకయినా మంచిది. రేపు మధ్యాహ్నం ఒకమారు స్టేషన్‌కు రండి. ఇన్స్పెక్టర్ గారికి చెబుతాను. లేకపోతే మీకు - నావల్లకాదుగాని, నాలాంటి వాళ్ల వల్ల ప్రమాదం. వస్తారు గదూ ! వెళ్లి రండి. ఇంటికి వెళ్లండి. ఇంకేమీ ముందుకు వెళ్లాలని చూడకండి...

- అన్నాడు. ఒక్కబిగిని చెప్పినట్లూ, ఒక్కఉపన్యాసం ఇచ్చినట్లూ.

వినదగు నెవ్వరు చెప్పిన - గుర్తు వచ్చింది రావుకు. పోలీసు సాల్యూట్ చేసి వెళ్లిపోయాడు. తరువాత మళ్లీ గుర్తు వచ్చింది. వినినంతనె వేగపడక వివరింపదగున్! మహిలో నీతిపరుడు అవడాన్ని గురించి ఎంత చక్కటి సూచన ఇచ్చాడు ఈ చిన్న కందంలో.

రావుకు ఆశ్చర్యం కాదు, ఆనందం అనిపించింది. చెవులు పెట్టుకు వినాలి గాని ఎన్ని మంచి సంగతులు ఈ ప్రపంచం నిండా ! ఒళ్లంతా చెవులు చేసుకున్నా చాలదు కదా! -- గడియారం టిక్ టిక్ వినిపించేంత నిశ్శబ్దం మళ్లీ. పోలీసుతో తను ఎక్కువ మాట్లాడాడా ? అంతా అతన్నే మాట్లాడనిచ్చాడు. అతని మనస్సు ఎలా పని చేస్తుందో అంచెనా వేసుకు చూచుకున్నాడు, అంతే ! పోలీసు తనను అద్దంలా చూచుకోవటానికి

అనుకూలత ఏర్పరచాడు. అంతా అతనికే అర్థం అయిపోయింది.

రావు ముందుకు అడుగు వేశాడు. వెనక్కు అడుగు వేయడం ఇష్టం లేదు. ముందడుగేగాని వెనకడుగు పనికిరాదు. వెళ్లిన ప్రదేశానికే మళ్లీ వెళ్లదలుచుకున్నా వెనకడుగు వేయగూడదు. ముఖం మటుకు 180 డిగ్రీలు తిప్పితే చాలు. ముందడుగు వేసినా అప్పటి వెనుకటి సంగతులే - ప్రదేశాలే అగుపిస్తాయి. వాటి మీద కొత్త వెలుగుతో కొత్త వేడిమితో ప్రయాణం సాగించవచ్చు.

పోలీసుకు అర్థం అయింది. రావుకూ అనిపించింది తనకు ఏ పాటి అర్థం అయిందో కొలుచుకోవడం మంచిదని. పోలీసు కళ్లల్లో ద్వేషం లేదు. ఎర్రటి దయ ఉంది. ఎరగా చూపించే దాష్టీకం ఉంది. ఈ ప్రపంచం నేను అనుకున్నంత క్రూర మయింది కాదు. అంతకంటె ఎక్కువ వికృతం అయినది.

పోలీసు పోలికలు లేకుండా వెళ్లిపోయాడు. పోల్చుకున్నాడు తనను. అందుకే వెళ్లి పోగలిగాడు. పోకడలు అర్థం చేసుకోవడం అతనికి తెలిసినంతగా అందరికీ తెలిస్తే ఎంత బాగుండును ! --- రావుకు ఇదే ఆలోచన.

• • •

అర్థం చేసుకోవడం దగ్గరకు వచ్చేటప్పటికి అతనికీ అనుమానమే. అన్నీ అర్థం అయినట్లే ఉంటాయి ఎప్పటికప్పుడు. నిజంగా అర్థం అయినాయా - అంటే అనుమానమే తప్ప అవుననే సమాధానం రాదు.

ఒకమారు - పొరుగున ఉన్న ఒకామె అంటుంది, స్పష్టంగా విన్నాడు తను. 'ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలి. మన మనస్సుల్లో హృదయాల్లో ఏమేం భావాలు ఉన్నాయో వాటిని దాచుకోవడం తప్పు. అనుకున్నది అనుకున్నట్లుగా చెప్పనివాడు ఏం మనిషి ?' ఆమె మరో ఆమెతో ఎంతో నిజాయితీగా పోట్లాడుతోంది.

ఆ మనిషే మరో అరగంట పోయిన తర్వాత ఇంకొక ఆమెతో అంటోంది. 'మనకు నోరుంది గదా అని కుండ బద్దలు కొట్టినట్లు మాట్లాడుతామా ? కాస్త ముందు, వెనుక చూచుకోవద్దూ? ముక్కుకు సూటిగా పోతాం అని ప్రతి వాడితోనూ విరోధం తెచ్చుకోవడమేనా?' అమె మాటల పోట్లాటలలో ఈమారు కూడా ఎంతో నిజాయితీ ప్రస్ఫుటం అవుతోంది.

రావుకు ఈ రెండు రకాల మాటలూ మనస్సుకు అతుక్కుపోయినట్లు అమరాయి. గంటలోనే ఆమె తన అభిప్రాయం మార్చుకోవడం - అలా మార్చుకున్నానని తెలియకుండానే బడబడ మాట్లాడటం ఆశ్చర్యం అనిపించింది.

మనిషి ఏ అంతస్తు నిజం ? నిజం అయిన దాంట్లో ఎంత వరకు నిజంగా నిజం? నిజాన్ని శరీరం నుంచి 'ప్రజ్ఞ' దాకా జరుపుకుంటూ పోవడం తత్త్వశాస్త్రానికి అలవాటే. కాని దాన్ని అన్నిటితో సమన్వయం చేసుకు వ్యవహరించడం అవసరం కదా!

పారమార్థిక సత్యం - నిత్యనైమిత్తిక సత్యం, రెండూ వేరువేరుగా భాసిస్తాయేమో గాని, నిత్యసత్యాలలోనే రెండు రకాలు, అందులోనూ పరస్పరం వ్యతిరేకం అయిన పద్ధతులు - ఉన్నాయంటే రావుకు ఇమడకపోగా కాస్త వ్యతిరేకత కూడా బయలు దేరుతోంది. జనాన్ని - వాళ్ల మనసుల్ని అర్థం చేసుకోవడం ఎట్లాగో నిమిషానికో మోస్తరుగా అభిప్రాయాలు, ప్రకటనలు మార్చుకుంటూ మసిలే మనుషుల మధ్య వ్యవహారం చేయటం ఎట్లా ?

రావుకు చికాకు - వంటి మీద జలగలు ప్రాకుతున్నట్లు అనిపిస్తుంది, ఇటువంటి సందర్భం తటస్థించినప్పుడు.

జనం అంతా రెండు రకాలుగా చీలిపోతున్నారా ? తార్కికంగా ఆలోచించగల వాళ్లు, ఆలోచనతో నిమిత్తం పెట్టుకోకుండా గుడ్డిగా ఏ ఎండకు ఆ గొడుగు పడుతూ ముందుకు పోదామని చూచేవాళ్లూ !

రావుకు గుర్తు వచ్చింది. చిన్నప్పుడు ఒక పుస్తకంలో చదివిన సంగతి : ప్రపంచంలోని ప్రజలు రెండు విధాలు :

తెలిసిన వాళ్లు : తెలియని వాళ్లు. ఈ విభజన తార్కికంగా బాగానే ఉండవచ్చును గాని అడ్డగీతలు గీయడం నిజంగా కుదురుతుందా ? అందరికీ అన్ని విషయాలూ తెలుస్తాయా ? తెలియని వాళ్లు ఎప్పుడూ అలానే ఉండిపోతారా ? అనేక విషయాల మధ్య ప్రస్తావనల నడుమ అందరూ తెలిసీ తెలియని వాళ్లుగా మిగిలిపోవడం లేదూ? 'తెలిసియు తెలియని నరుదెల్ప బ్రహ్మదేవుని తరమే!') - అని ఓ పద్యం చదివినట్లు గూడా గుర్తు.

కొన్ని విషయాలు తెలుస్తాయి. ఆ తెలియడంలో కూడా కూలంకషంగా సంపూర్ణంగా ఇంకా ఏమీ మిగలనట్లు - అవలీగా తోచడం సాధ్యమా ?

తెలిసిన దాని నుంచి తెలియని దానికి అస్సలు పోలేవు నువ్వు అంటే రెంటినీ 'వాటర్ టైట్ కంపార్ట్‌మెంట్స్' గా తయారు చేసినట్లు అయిపోవడం లేదూ? కళ్ల ముందు ప్రత్యక్షంగా కనిపిస్తున్నది గదా అని మనకు అన్నీ సజావుగా తెలుసునని అనుకోవటానికి ఉన్నదా ?

ఈ ప్రపంచంలో ఉంటున్నాం, ఈ విశ్వంలోనే విస్తరిస్తున్నాం - అయినా ఈ ప్రపంచం, ఈ విశాల విశ్వం మనకు ఎంత వరకు అర్థం అయింది ? అసలు - అర్థం చేసుకోవడం అవసరమనే సంగతి గుర్తించింది ఎంత మంది ? గుర్తించినా అందుకు అవకాశాల ద్వారాలు తెరుచుకు బాహాటంగా నడుస్తున్న వాళ్లు ఎంతమంది ? తూర్పు గాలులతోనో, పడమర గాలులతోనో బిగుసుకుపోయి ఉక్కిరి బిక్కిరి అయిపోతున్న వాళ్లేగాని గాలికి తూర్పు పడమరలు లేవు. అంతటా ఒక్కటే తీరు - ఒక్కటే తెన్ను అని అర్థం చేసుకునే వాళ్లు ఎంత మంది ? - రావుకు మనస్సు మందమందంగా తయారవుతోంది. ఇలాంటి సమయంలో మలయ మారుతం మచ్చికగా విహరిస్తే తప్ప ఈ మాంద్యం తొలగదు; చెదరదు.

వారం రోజులుగా వింటున్నాడు. ఊరి బయట - పచ్చిక బయళ్ళూ పసిడి పొలాలూ రద్దు చేసి ఓ ఫ్యాక్టరీ కడుతున్నారు - అని. ఆ ఫ్యాక్టరీ కడుతున్న తావునుంచే - దాని పక్కరహదారి నుంచే - తాను ప్రతి సాయంత్రము, ప్రతి రాత్రీ నడుస్తున్నాడు. ఆరు బయలు చూడడం అలవాటు అయిపోయిన కళ్ళకు ఆ బయలులో ఏదో బంగళాలు, భవనాలు కట్టడం ప్రారంభం అయినా వ్యత్యాసం మటుకు మనసుకు పట్టలేదు. తెలిసి రాలేదు. దాన్ని గురించి జనం బాహాటంగా మాట్లాడుకోవడం వినేంత వరకూ.

అందరికీ తెలిసిన సంగతులు తనకెందుకు మృగ్యం అయిపోతాయి ? అందరి నోళ్లల్లోనూ నానుతున్న విషయం తనకు ఎందుకు సులభగ్రాహ్యం కావడం లేదూ?

ఊరు - నగరం చెడిపోతోంది. ఫ్యాక్టరీ మన వాతావరణానికి సరిపడదు. ఊరు వెలుపల చక్కగా బయలు ప్రదేశం ఉండాలిగాని పొగగొట్టాలు, చిమ్నీలు, కాలుష్య

కారకాలు ఉండగూడదు - అని కొందరు తీవ్రంగా ఉద్యమంగా ఉవ్వెత్తున లేచి పడుతూ చెబుతున్నారు.

ఫ్యాక్టరీ కట్టడం కొన్ని నెలలుగా జరుగుతున్న పని. ప్రతిరోజూ తాను ఆ రోడ్డంటే విధాయకంగా వెడుతున్నాడు. అయినా అక్కడ కట్టడం పని జరుగుతోందనే విషయమే స్ఫురణకు రాలేదు. తాను కళ్లు ఉండీ చూడలేక పోయినాడు. చూచినా అర్థం చేసుకోలేనివాడు అయిపోయినాడు.

అసలు ఆ భవనాలు, భవంతులు అక్కడ ఉండడం సరికాదని కొందరు అంటూంటే - ఈ కట్టడం పని స్వదేశీ కంపెనీకి ఇవ్వవలసింది కాదు, విదేశీ కంపెనీ అయితే మరింత మెలకువగా ఆకర్షవంతంగా ప్రయోజనం దృష్టిలో ఉంచుకుని 'నిర్మాణ కార్యక్రమం' పూర్తి చేసేది. 'మనవాళ్లు వట్టి వెధవాయలోయ్. మనకు ఏదీ సరిగా చేయడం చేతకాదు'- అని కొత్త కోణం నుంచి మరో నినాదం తీసుకు రావటానికి ప్రయత్నం చేస్తున్నారు.

రావు - ఆ తరువాత కొన్ని రాత్రుల పాటు ఫ్యాక్టరీ భవనాలను దూరం నుంచే పరిశీలనగా చూచాడు. ఎన్నో హాంగర్లు. భవనాలకు ద్వారాలు, కిటికీలు. ఆకాశంలోకి దూసుకు పోయే పొగగొట్టాలు. బాయిలర్లు - ఊరి వాళ్లందరినీ అందులో వేసి వేయించటానికి సరిపోయేంత వైశాల్యంలో ! ఎంత బ్రహ్మాండంగా ఉంది ! - కట్టడం మనిషి ప్రగతికి ప్రతీక. నేల నుంచి నింగి దాకా పరుగులు తీసే ఇటుకలు. ఆ ఇటుకలు బిగుసుకోవటానికి సిమెంట్, కాంక్రీట్, ప్లాస్టర్, పైన రంగులు - కన్నులు చెదిరిపోయే డిజైన్లు !

మిల్లు పుట్టింది. మనిషిని మింగింది. జీవితంలో 'థ్రిల్' వచ్చింది తప్ప అసలు ఉండటానికి కావలసిన 'విల్' పోయింది - అని కొందరు మరేవో మాటలు పుట్టిస్తున్నారు. పరిశ్రమలు ! వ్యవసాయం !! - ఈరెండూ వేరు వేరా ? అస్సలు కలిసి పోవా ? రెండు మాటలకూ అర్థం ఒక్కటే గదూ ! ఒకదాని కొకటి వ్యతిరేకం, విభిన్నం అయినట్లు ఎందుకు చూస్తున్నారు, జనం ?

మనది వ్యావసాయిక దేశం. దాన్ని పారిశ్రామికం చేయడం తగదు. కుటీర పరిశ్రమలు ఫరవాలేదు - అని ఇంకా కొందరు పాతకాలపు కబుర్లకే అంకితం.

పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తే తప్ప మనం సంపన్నం కాలేం. అంతవరకు అడుక్కు తింటూనే ఉండిపోతాం. ఎన్నాళ్లయినా ఇలా దరిద్రగొట్టుగా ఉండిపోదామనా మీ ఉద్దేశ్యం ? - అని బుకాయిస్తున్నారు, మరికొందరు. ఏది నిజం ? ఏది ఎంతవరకు నిజం ? - రెండు అభిప్రాయాలు ఉన్నాయంటే వాటిని వేరువేరుగా చూడకుండా ఒక్కటిగానే చూచి సమన్వయం చేసుకుని సంయమనంతో ఉండడం చేతకాదా? ఒకదాని కొకటి పోటీ అని ఎందుకు అనుకోవాలి ? తోడు - నీడ అనుకోవడం కుదరదా ?

ఆలోచిస్తూ ఉండడమే తప్ప అసలు విషయం అవగాహనకు చిక్కక పోవడం లోపాతి లోపంగా కనిపించసాగింది రావుకు. ఫ్యాక్టరీ మంచిదేనా ? బిస్కట్లు మొదలు - బాంబుల వరకు తయారు చేస్తారు ఈ ఫ్యాక్టరీలలో. వస్తు సంపద పెరుగుతుంది. దుకాణాలు - కొనుగోళ్లు - అమ్మకాలు. నమ్మకాలన్నీ తారుమారు అయిపోయే వాతావరణం.

అవసరం అయిన వస్తువులు - అవసరాలు పెంచే వస్తువులూ - అనేకం తయారవుతాయి. చక్కగా ప్రదర్శన అవుతాయి. ఇవి లేని జీవితం ఇన్నాళ్లూ గడిపాం. ఈ సౌభాగ్యం లేకుండా ఇన్ని రోజులూ ఎలా దొర్లించగలిగామో ఆశ్చర్యం ! - ఆశ్చర్యం కాదు, సిగ్గుపడవలసిన సన్నివేశం.

యాభయి ఏళ్ల కిందటి మాట ! ఓ స్నేహితుడు బజార్లో కనిపించాడు. ఎందాకా వెడుతున్నావు ? అని అడిగితే 'మరీ ఉక్కగా ఉంది, మధ్యాహ్నం పూట ఇంట్లో హాయిగా పడుకోలేకపోతున్నాను. ఓ ఫ్యాన్ కొనుక్కుందామని బయలుదేరాను' అన్నాడు. తననూ రమ్మన్నాడు, కబుర్లు చెప్పుకుంటూ నడిస్తే దూరం తరిగిపోతుంది.

ఎన్నో దుకాణాలు దొర్లిపోతున్నాయి. ఒక్కదాంట్లోకీ ప్రవేశించడు అతను. దుకాణాల వరుసలన్నీ తరిగిపోయాక ఓ పక్కసందులోనికి తీసుకు వెళ్లాడు. వెదురు చాపలు, తాటాకు బుట్టలు, గంపలు అమ్మే దుకాణాలు. అలాంటి దాంట్లో ఒక చోటుకు వెళ్లి అక్కడ బానంత కడుపుతో కూర్చున్న ఆడమనిషిని అడిగాడు - చివరకు, 'మంచి విసనకర్రలు ఉన్నాయా ?' అని. ఆ మనిషి మరో కుర్రాడిని పిలిచి రకరకాల విసనకర్రలు, రంగు రంగులవి - సున్నితమైనవి - సుకుమారమైనవి - సులభంగా

ముడుచుకు పోయి తెరుచుకునేవి - ఇలా రకంలోనూ, సైజులోనూ ఎన్నో వ్యత్యాసాలు, ముందు పడవేయించింది. చివరకు ఆ స్నేహితుడు రెండో మూడో తాటాకు విసన కర్రలు - అతి సామాన్యంగా ఉన్నవి, గీసి గీసి బేరం చేసి కొనుక్కున్నాడు. 'రెండేళ్లు వస్తాయా?' అనడిగాడు. ఆ అమ్ముతున్న దుకాణదారును. 'జాగ్రత్తగా వాడుకుంటే జీవితాంతం వస్తాయి' - అంది ఆమె తడుముకోకుండా. వస్తువులు జాగ్రత్తగా పొదుపుగా వాడుకోవడం ఆ స్నేహితుడికి బాగా అలవాటు. ఈ విసన కర్రలు కూడా అతని ఆస్తితోపాటు కొడుకులకు పంపకాలు చేస్తాడు - అనుకున్నాడు రావు.

అసలు ఆశ్చర్యం కలిగించే మాట ఏమిటంటే అప్పటికే ఎలక్ట్రిక్ ఫాన్లు - టేబుల్, సీలింగ్, పెడస్టల్ - ఇవన్నీ విరివిగా బజార్లోకి వచ్చేశాయి. వంద రూపాయలు పెడితే మాంచి 'ఫాన్' అనుకునే రోజులు. అయినా ఆ స్నేహితుడు పావలో పరకో పెట్టి తాటాకు విసన కర్రలు కొనుక్కున్నాడు - అదీ గంటసేపు తిరిగి, తననూ తిప్పి, గీసి గీసి బేరం చేసి. విసనకర్ర కొన్నాక విసురుకుని చూచాడు. తనకూ ఇచ్చి, పరీక్ష చేయమన్నాడు. గాలి బాగా వస్తోందా ? ప్రాణానికి ఈ క్షణం నుంచి హాయిగా ఉంటుంది - అని తన చేత కూడా ధైర్యం చెప్పించుకున్నాడు..

'ఎలక్ట్రిక్ ఫ్యాన్ కొనుక్కోవచ్చుననుకో - అయినా వృథాగా డబ్బు దండగ ! పైగా కరెంట్ ఖర్చు. ఎక్కడికి పడితే అక్కడికి తీసుకు పోవడం గూడా కష్టం; బరువు. పిల్లలు తన్నేసినా, కిందపడేసినా, దాంట్లో చేతులు పెట్టినా, బహు ప్రమాదం. ఎందుకు వచ్చిన బాదరబందీ ! ఈ విసన కర్రలయితే చేతికి చక్కగా అమరుతాయి. శరీరానికి హాయిగా తగులుతాయి. విసురుకొన్న కొద్దీ చేతి నరాలు కూడా గట్టిపడతాయి - అని సుదీర్ఘ ఉపన్యాసం ఇచ్చాడు.

ఇంటిదాకా తీసుకువెళ్లి ఆ విసనకర్రలు తన చేతనే ప్రారంభోత్సవం చేయించినందుకు రావు చాలా ఆనందించాడు. స్నేహితుడికి తన మీద ఎంత గౌరవం ! ఎంత మక్కువ ! సులభం, సూక్ష్మం - రెండూ తెలుసును ఈ స్నేహితుడికి. అతని దగ్గర నేర్చుకోవలసిన సుగుణాలు ఎన్నో ఉన్నాయి - అనిపించింది.

రావుకు తన మీద తనకే కోపం వచ్చింది. అసహ్యం వేసింది. కట్టడం పని రోజూ చురుకుగా జరిగిపోతూ ఉన్నా, ఇది తన గమనానికి ఎందుకు రాలేదు ? - ఊళ్లో

జనం చెప్పుకునేంత వరకు ! తన దృష్టి దానిమీద ఎందుకు పడలేదు ! అంతగా ఆకాశంలో కూరుకుపోయినాడా తను ? నేల విడిచి సాముచేస్తున్నాడా ?

ఫ్యాక్టరీ వస్తే రొద, చప్పుళ్లు, వాసనలు, దుర్భర వాతావరణం, వస్తు ఉత్పత్తి కావాలంటే ఇవన్నీ తప్పవు.

సోక్రటీస్ గుర్తుకు వచ్చాడు.

ప్రతిరోజూ దుకాణాల వరసల్లో తిరుగాడే వాడట ! వింత వింతలన్నీ చూస్తూ. ఒక్కటీ కొనేవాడు కాదట; డబ్బు లేదో మరేమో ! ఎవడో హితైషి ముందుకు వచ్చి - 'ఏమండీ, సోక్రటీస్ గారూ - రోజూ చూస్తున్నాను - ఎన్నడూ కొనగా మటుకు చూడలేదు. పైకం ఏమన్నా సర్దుబాటు చేయమంటారా ? వడ్డీ వద్దు లెండి, అసలు కూడా మీకు వీలయినన్ని వాయిదాలలో ఇవ్వండి, ఫరవాలేదు. ఒక ఊరి వాళ్లం. మనకు లావాదేవీలు ఏముంటాయి -' ఇలా ప్రాధేయపడుతూ చెప్పుకుంటూ పోయాడు. సోక్రటీస్ నవ్వాడు. ఆ నవ్వులోనే ప్రపంచాన్నంతా కొనివేసే వెల ఉన్నదని రావు అభిప్రాయం.

'అబ్బే, నాకేం వద్దండీ. అవసరంలేని వస్తువులు ఈ ప్రపంచంలో ఎన్ని లక్షలు, కోట్లు ఉన్నాయా అని గమనిస్తున్నాను ప్రతి రోజూ' అన్నాడు జవాబుగా. సరే, ఆ విషయం స్పష్టంగా సూటిగా చెప్పాడు బాగానే ఉంది. అయితే ఆ హితైషికి అతడు చేసిన 'ఆఫర్'కు 'థాంక్స్' చెప్పాడా, లేక అ విషయంలో ఉదాసీనంగానే ఉండి పోయాడా? --- రావుకు ఈ 'పాయింట్' తేలలేదు.

తన స్నేహితుడిలో సోక్రటీస్ పోలికలు కొన్ని ఉన్నాయి, సందేహం లేదు. వస్తువు 'ప్రయోజనం' చూచాడు తప్ప, బాహ్యాడంబరం - పటాటోపం - ప్రామాణికత అంతగా పట్టించుకోలేదు. రావుకు తన అవగాహన లోపానికి, అర్థం చేసుకోవడంలో జాప్యానికి, తన తక్కువ తనానికి కొద్దిగా సిగ్గనిపించింది. ప్రపంచంలో అందరూ తన కంటె తెలివి అయినవాళ్లే. ఆ తెలివిని జాగ్రత్తగా ఉపయోగించుకుని సుఖంగా ఉండడం ఎరిగిన వాళ్లే.

వీళ్లందరికీ ప్రపంచాన్ని గురించి, విశాల విశ్వాన్ని గురించి చాలా ఎక్కువ తెలిసి ఉంటుంది. తనతో పోల్చి చూచుకుంటే వాళ్లందరూ విజ్ఞానంలో ఉన్నతులు; విశేష

ప్రజ్ఞావంతులు అయి ఉంటారు. అసలు - వాళ్లదాకా ఎందుకు ? కలుగుల్లో ఎలుకలు, మెత్తగా అడుగులు వేసే పిల్లలు, భైరవుడిలా భీకరంగా అరిచే కుక్కలు, సందులేని చోట కూడా సునాయసంగా దూరిపోయే చీమలు - ఇలాంటి సూక్ష్మాతి సూక్ష్మం అయిన దోమలు, బొద్దింకలు, ముంగిసలు, తేళ్లు, పాములు - వీటికన్నిటికీ తన కన్నా ఎక్కువే తెలిసి ఉంటుంది. సందేహం లేదు. సందేహం అవసరం లేదు. ఎందుకు తన ఆలోచనలన్నీ ? అసంగతం, అనాఘాతం !

తనకున్న జ్ఞానానికి తన మీద తనకే కోపం, సిగ్గు, అసహ్యం - ఇవన్నీ కలగాపుల గంగా కలుగుతున్నాయి. తనను చూచి జనం నవ్వు తున్నారు. నవ్వరూ మరి ! ఇంత వృద్ధుడు, ఆలోచనలేని మంద భాగ్యుడు, కళ్ల ఎదురుగా కనిపిస్తున్న దాన్ని కూడా అర్థం చేసుకో లేనివాడు, కనుచూపు మేర దాటిన విషయాలను గురించి కల్లోలపడిపోయే వాడు - ఎలా పుట్టాడు ? ఎలా పెరిగాడు ఇన్నాళ్లూ ? ఎలా మనుతున్నాడు మన మధ్య ? మన విలువను కూడా పాడు చేస్తున్నాడా ? తరుగు చేస్తున్నాడా ? - వీడిని ఏం చేద్దాం? ఏం చేయకుండా వదిలేద్దాం - అదే వాడికి శిక్ష, అదే వాడికి 'చావు' అని చెప్పుకుని నవ్వుకుంటున్నారు.

నవ్వుల పాలయిపోయింది తన బతుకు. గుప్పిటి బిగి విడిపోయింది; సడలి పోయింది. ఇన్నాళ్లూ తెలివిగలవాడు అనుకున్నాం వీడిని. కాదు, కాదని ఇప్పుడు తెలిసి పోయింది - అని ఇంకా నవ్వుకుంటున్నారు - జనం అంతా !

రావుకు దుఃఖం పొంగుకు వచ్చింది. గుండె బరువై తేలికయి పోతోంది. తన కేమీ తెలివి తేటలు లేవు. తెలివితేటలు ఉన్నాయనీ, ఆలోచించడంలో అందరి కంటె మిన్న అనీ ఇన్నాళ్లూ గర్వాతి శయంతో, దర్పంగా నడిచాడు నేలమీద. తలకాయ ఆకాశంలో ఉందనుకున్నాడు. అసలు తలకాయే లేదని తేలిపోయింది.

ఫ్యాక్టరీలు కట్టడం చూచినవాళ్లు, దాని యంత్రాల పనితనం తెలిసినవాళ్లూ, దాని మనుగడను గురించి రకరకాలుగా వ్యాఖ్యానాలు చేసుకుంటూ కబుర్లు చెప్పుకో గలిగిన వాళ్లు, ఈ సామాన్య ప్రజలు. వీళ్ల ముందు, ఈ జనం మధ్య తాను పూర్తిగా అవివేకి. శూన్య దృష్టుడు. అంతే కదూ ?

యంత్రాలు - యాతనలు. యంత్రాల పనితీరు తెన్నులు తెలుసుకున్న పనివాళ్లూ,

ఇంజనీయర్లు. ఎక్కడ ఏ రకం నూనెలు వేయాలో, ఏ శీల ఎంత గట్టిగా బిగించాలో బాగా తెలిసిన వాళ్లు.

పళ్ల చక్రాలను బాగా నడిపించి వస్తువులు తయారు చేయగలవాళ్లు, ఇంజనీయర్లు, దేశం సంపదను, వస్తు ఉత్పత్తిని విపరీతంగా పెంచి వేసి ఆర్థిక స్థితిగతులు మిన్న చేయగలవాళ్లు.

వీళ్లందరి ముందు తన తెలివి తేటలు ఏ పాటి ?

ఏం చేయాలన్నా సునాయసంగా చేతులు చకచక కదలగల, కదిలించగల మనుషుల ముందు తాను ఎంత ?

సాయంత్రం పూట, రాత్రి సమయంలోనూ షికారు తిరగడం తప్ప ఇంకేమీ తెలియని వాడు తను; చేతకాని వాడు. బేలతనం తప్ప, భేషయిన తనం ఎరగని వాడు. ఆ తిరగడంలో కూడా చూడగలిగీ మామూలు మనుషులు కనిపెట్టగల విషయాల విషయంలో తన కళ్లు మూతలు పడిపోయి ఉండిపోయియని కూడా తేలిపోయింది!

ఇంక ఎంత మొత్తుకుంటే మటుకు ఏం లాభం ?

లాభ నష్టాలు బేరీజ వేస్తూ కూర్చుంటే ఇంక ఏం పని చేయగలడు ? అలా బేరీజ వేసుకోకుండా అసలు పనే కుదరదు.

'నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు' - అని చెలాకీగా పాటల్లో పాడుకుంటూ తిరగడం చేతకాదు. చెదురుమదురుగా కనిపిస్తున్న మనుషులు, వాళ్ల మానసాలు గమనించడం తగినపని. మనసుల్లో వాళ్ల కలలన్నీ గూడుకట్టుకు ఉంటాయి.

'అవునా? కలయేనా?'

కలలో గూడా అనుకోని సంగతులు ఇలలో జరుగుతున్నాయి. కలకు ఇలకు వారధి కట్టేది ఎవరు ? ఆ మానసాలే గదూ ! భవిష్యత్తును గురించి చెప్పేవాళ్లు ఈ మనస్సులనే ముందుగా చదువుతారట. వీటి మీదనే కథలు అల్లుకు పోతారట. గతంలో జరిగిన నాలుగయిదు విషయాలు చెప్పగలిగేటప్పటికి వింటున్నవాడు విసనక్రలాగ ఊగిపోతాడు. ఇక ముందు చెప్పే సంగతులన్నీ వినడానికి చెవులు దోరబెట్టుకుని కూర్చుంటాడు. ఒక రకంగా కనుకుని ఆకట్టుకోవడం అంటే ఇదే. వాళ్లకు అక్కర్లేని విషయాలన్నీ ఎంతో ముఖ్యం అయినవి అన్నట్లుగా. ఉత్సాహంగా ఉరకలు కలిగించేట్లుగా చెప్పటానికి వాక్

స్థానంలో బృహస్పతి కూడా ఉండాలి. ఇంకచెప్పాలీ ఆ జ్యోతిష్యుడి ప్రతిభ! ప్రపంచం అంతా ఏలేస్తాడు. అందరి మనస్సులు దున్నేస్తాడు. హృదయాలు దాచేస్తాడు.

ఎప్పుడో 1900 ప్రాంతంలో విశాఖపట్టణం జిల్లాలో కొర్రా మల్లయ్య ఇటు వంటి అవస్థలోనే పడ్డాడు. అతను కొండజాతి వ్యవసాయ పారిశ్రామికుడు. దేశానికి స్వాతంత్ర్యం రావాలని తపించిపోయే కోట్లాది భారతీయుల్లో ఒకడు. అతనికో కల వచ్చింది. శుభ ముహూర్తం చూచుకునో, చూచుకోకుండానో.

'మల్లయ్యా, నువ్వు ఎవరనుకుంటున్నావు ?' అనడిగాడు కలలో అతని దేవత. మల్లయ్య శిరస్సు వంచి నమస్కారం చేశాడు. చెప్పండి సామీ - అనలేదు గాని ముఖం నిండా అదే మాట.

'నువ్వు పంచపాండవుల్లో ఒకడివి... నీ కొడుకే కృష్ణుడు. నువ్వు మాత్రం పాండవుల్లో ఒకడివి. నీ కొడుకే కృష్ణుడు. మీరు దేశ స్వాతంత్ర్యం సాధించటానికి పునర్జన్మ తీసుకున్నారు. నీవు సైన్యాన్ని తయారు చేసుకో. వెదురు బొంగురులతోనే తుపాకులు, తూటాలు తయారు చేసుకోండి. యుద్ధ సమయంలో అవి నిజమైన ఆయుధాలుగా రూపు కట్టుకుంటాయి. బలం పుంజు కుంటాయి. ఇదే నా వరం. బ్రిటిష్ వాళ్ల మర తుపాకులన్నీ ఉత్తుత్తి తోలుబొమ్మలయి పోతాయి. నీ కొడుకే రాజవుతాడు, భారతదేశాన్ని పాలిస్తాడు' - అని కలలోనే దేవత ఆశీర్వచనం ఇచ్చాడు.

కొర్రా మల్లయ్య ఆ ఆదేశాల ప్రకారమే పనిచేశాడు. జనాన్ని పోగు చేశాడు... కాని ఏమీ జరగలేదు చివరకు, బ్రిటిష్ పోలీసు బలగం అతన్ని, అతని పరివారాన్ని నిర్దాక్షిణ్యంగా చంపేశారు!

'నేను ముందే చెప్పాను గదూ! మనిషి కావాలనుకుంటాడు - దేవుడేమో ఇప్పుడు వద్దనుకుంటాడు. దేవుడు కావాలనుకున్నప్పుడు, మనిషి తయారుగా ఉండడు- దాఖలా కనిపించిందా లేదా నీకు ?' అని దబాయించి మరీ అడుగుతున్నాడు ఒక మనిషి. అతను సైకిల్ పట్టుకుని నడిపించుకుంటూ వెడుతున్నాడు. పక్కన రెండో మనిషి లేకపోతే సైకిల్ తొక్కుకుంటూ వెళ్లిపోయే వాడేమో! ఇప్పుడు మాత్రం మాట్లాడు కుంటూ కబుర్లు చెబుతూ, వింటూ నడుస్తున్నాడు. అతడి మాటల్లో మంచి ధోరణి ఉంది. పక్కవాడి తెలివి తేటలు పెంపొందించే ప్రయత్నం చేస్తున్నాడు.

పక్కవాడు ఏదో జవాబు చెప్పే ప్రయత్నంలో ఉన్నాడు. చేతులు ఊపుకుంటూ తనను సమర్థించుకుంటూ మాట్లాడాలని చూస్తున్నాడు, కాని సైకిల్ మనిషి అతన్ని నోరు విప్పనిస్తేగా ! తానే సర్వజ్ఞుడు అన్నట్లుగా చెప్పుకుంటూ పోతున్నాడు.

'పురుష ప్రయత్నం అను, దేవుడి ఆశీర్వచనం అను - ఏమయినా పేరు పెట్టుకో. రెండూ కలిసి పోవాలి. లేకపోతే ఒక్కపనీ సానుకూల పడదు, ఏమనుకున్నావో' - అంటూ చెప్పుకు పోతున్నాడు. 'సినిమాకు వెళ్లాలని బయలుదేరావు. కాని ఏం లాభం? టిక్కెట్లు అయిపోయినాయి. పోనీ ఏదో ఒక సినిమాకు వెడదాంలే, ఫరవాలేదు - అని ప్రయత్నం చేశావు. అదీ కుదరలేదు. దారి వెంట వస్తుంటే దోపిడిగాళ్లు ఉంటారేమో నని భయం వేసింది. తోడెవరయినా దొరుకుతారా అని చూచావు. దేవుడిలాగ నేను కనిపించాను - అనుకున్నావు. ఇద్దరం కలిసి నడుస్తున్నాం. దూరం సగానికి సగం తరిగి పోయింది. మరో పది నిముషాలు నడిచాం అంటే - ఈ రోజుకు మన యాతన గడచి పోయినట్లు. హాయిగా నిద్రపోతాం. కడుపు నిండా తింటాం అనుకో. భార్యా పిల్లల్ని పలుకరిస్తాం. తరువాతనయినా మనం చేసే పని నిద్రపోవడమేగా ! - మళ్లీ తెల్ల వారి పోతుంది. ఆఫీసు - దుకాణం - వ్యవహారం - అంతా మామూలే ! సైకిల్ మనిషి వాక్ ప్రవాహానికి అడ్డు-ఆపు లేదు.

రావుకు సమాంతరంగా వాళ్లు అదే స్పీడ్‌లో నడవడం వల్ల ఈ సంభాషణ స్పష్టంగా అసలు తనను ఉద్దేశించి చెప్పుకున్నట్లే - అనిపించింది. వాళ్ల సమస్యలు ఏమయినా అవనీ, అవి పరిష్కారం అవనీ - అవకపోనీ; కోట్లకు విలువయిన మాట అన్నాడు ఆ సైకిల్ మనిషి.

'అచ్చుపు చీకటింబడి గృహవ్రతులై -' గుర్తుకు వచ్చింది.

వేదాంతంలో ఎప్పటికీ జవాబు దొరకని ప్రశ్న. వేధించే ప్రశ్న. మనిషిస్వతంత్రుడా లేక పరతంత్రుడా ? ఎంతవరకు స్వతంత్రుడు. ఎంత దూరం ఇతరుల మీద ఆధారపడి ఉంటాడు ? అందీ అందని భగవంతుడి మీద ఎంత వరకు కర్తవ్యం ఉంది?

వేదాంతంలో పడికట్టు మాటలే వేరు. అక్కడ మనిషి - మనిషి కాదు; మానవుడూ కాదు. వాడు కేవలం కళేబరం, జీవాత్మ. కరణ కళేబరాలు ఉంటాయి. వాసన

సంస్కారాలు ఉంటాయి. ఉద్బోధన ఉంటుంది. కార్యసామగ్రి పోగుచేసి కళేబరానికి అందిస్తాడు ఈశ్వరుడు; అంతా ఆయన సంకల్పానికి అనుగుణంగా. దాన్ని ఎలా ఉపయోగిస్తాడో - జీవుడి ఇష్టం. అనుకూలం కావచ్చు, ప్రతికూలం కావచ్చు, ఉదాసీనం కావచ్చు. అంతా అప్పయ్య దీక్షితులు ఇష్టం. ఎన్నయినా సందేహ బీజాలు ప్రవేశపెట్టవచ్చు.

జ్ఞానం ఉన్న స్థితి ఉంటుంది. జ్ఞానం లేని స్థితి ఉంటుంది. మూల ప్రకృతి యొక్క పరిణామ విశేషం చేత శరీరం నిరాటంకంగా పెరుగుతూ ఉంటుంది. ఎన్ని కబుర్లయినా చెప్పు, ఎన్ని తర్కాలయినా ప్రవేశపెట్టు. కర్తవ్యం స్వతంత్రమా - పరమాత్మ సంకల్ప నిర్ణయమా - రెంటినీ ఏ ఏ నిష్పత్తుల్లో కలుపుకు రసాయనం తయారు చేసుకోవాలి - అనేది నువ్వు సాధారణీకరణం చేయలేవు. చేయలేవు గాక చేయలేవు.

ప్రతి శాస్త్రంలోనూ ఇలాంటి వేధించే ప్రశ్నలు - వెక్సెడ్ క్వొశ్చెన్స్ - ఉంటాయి. వేధించుకు తినే ప్రశ్న పరంపరలు. జ్యోతిష్యంలో అయనాంశ ఇలాంటిదే. మనిషి జీవితంలో ప్రాణం పోకడ ఇలాంటిదే. సవాలక్ష జాబితా తయారు చేసుకోవచ్చు. కాలం - అదృష్టం - ఇంద్రియం (ఇచ్ఛ) ఇవి రకరకాలుగా 'పెర్ముటేషన్స్, కాంబినేషన్స్' చేసుకోవచ్చు. అవే 'పరమాత్మ' అని చెప్పుకుని మురిసి పోవచ్చు. దళవాద గ్రంథాలు తిరగవేయవచ్చు. శాస్త్రం చదువుకున్నవాడికి ఎలాంటి సంశయాలు, సందేహాలు, భేదాలు ఉండవు. మిడిమిడి జ్ఞానం గాళ్లకే ఈ కుశ్శంకలన్నీ. బాగా వెలుగు తున్న దీపం తన చమురును తానే తయారు చేసుకుంటుంది. మిణుకు మిణుకు మంటున్న దానికే నువ్వు నూనె చుక్కలు, ధారలు ఏర్పాటు చేస్తూ కూర్చోవాలి. అంతా ప్రాచీనం, ప్రాచ్యం. సోమరిగా, తామసంగా నిద్రపోతూ లేవటానికి బద్ధకం దట్టమైన పొరలు కప్పుకుని పోయి పడనీయకుండా ఉన్నవాడిని నువ్వేం ఎగొసన తోయగలవు ? చురుకుగా చలాకీగా తిరుగాడుతున్న వాడికే ఏదయినా ఆదేశాలు ఇచ్చి ఆచరణ సూత్రాలు తయారు చేసుకోమని చెప్పవచ్చును. అంతా దైవికం, అంతా ఐచ్ఛికం .. ఇలా పొంగిపోతూ పొర్లిపోతూ రోజులు యథాలాపంగా గడిపివేయడం అలవాటయి పోయి ప్రపంచం జడంగా తయారవుతోంది.

జడపదార్థానికి చేతనం జోడించటానికే ఈ ప్రయత్నం అంతా కదూ ? రావుకు

కొత్త చురుకుదనం వచ్చింది. నిరాశ నుంచి, నీరసం నుంచి కొద్దిగా విడుదల కలిగి నట్లయింది. అబ్బబ్బ ! ఎంత సేపయింది ఇదంతా ప్రారంభం చేసి -- ! దీనికి ఎప్పటికైనా - ఫైనాలిటీ - ముగింపు ఉంటుందా ? లేక ఇలా గానుగెద్దులా తిరుగుతూ పోవడమేనా ? అసలు తిరగకుండానే తిరుగుతున్నట్లుగా 'నటిస్తూ' కాలక్షేపం చేయడమేనా ?

ఫ్యాక్టరీలో యంత్రాలు - మనిషిలోని నియంత్రణలు ! ఎంత సామ్యం ఉంది. ఎంత వ్యత్యాసం ఉంది ! 'కీ' ఇచ్చి వదిలిపెడితే - వాటి ఇష్టం. కీచుమంటూ అరిచినా సరే, గావు కేకలు వేసినా సరే !

అంతర్యామి శాస్త్రం బాగా అవగతం చేసుకోవాలి - అనిపించింది రావుకు. అదే 'కీ'. లోపల ఏముందో తెలుసుకుంటే అది బయటకు ఎలా పనిచేస్తోందో కాస్త ఊహ చేసుకోవచ్చు. ఊహకు తోడుగా మనుషులు కూడా కనిపించి కొంత ఆలంబనం ఇస్తారు. తమ మాటలతో, తమ చేతలతో ఆలోచించుకుందుకు ఎప్పటికప్పుడు కొత్త సరంజామా అందిస్తారు. చేతలకు, చేతనానికీ ఏమిటి సంబంధం ? అసలు వ్యత్యాసం, అనేది ఉంటేనే గదూ - సంబంధం గురించి వెదకవలసిన సమయం ?

మనిషిని మనిషి కాల్చుకు తినడం, చేతనలు చేతలను కబళించి వేయడం అనుకో వచ్చా ? హింస చేస్తున్నావా, సేవ చేస్తున్నావా ? ఒకటి చేస్తున్నట్లు కనిపిస్తూ రెండోది ప్రవేశపెడుతున్నావా ?

కొత్త మనిషి. కొత్త శతాబ్దం.

శతాబ్ది ఎక్స్‌ప్రెస్ ప్రవేశపెట్టి కొత్త శతాబ్దానికి తీసుకుపోతున్నాడా ? తీరు బాటుగా కూర్చుని కళ్లముందే కాలం హరించుకు పోవడం చూస్తూ ఉన్నావా ? కాలం దేన్ని హరించుకు పోతోంది ? మళ్లీ మొదటికి వచ్చినట్లు అయింది రావుకు.

పుస్తకాలు రాయటానికి వల్ల కాదుగాని పుష్కలంగా మాట్లాడమంటే మటుకు ఆక్షేపణ లేదు. కష్టపడడం కంటె కష్టపడటాన్ని గురించి మాట్లాడడం తేలిక. కొంత మందికి మాట్లాడడమే కష్టం అయిపోతుంది. మనసు మూగదవుతుంది. మాట పెకిలి పైకి రాదు. పర-పశ్యంతి - లోనే ఉండిపోతుంది. మధ్యమం మారు మోగదు. వైఖరి ఏర్పడదు. ఇంక ఆ నాలుగింటినీ సంధానం చేసుకోవడం ఎక్కడ కుదురు తుంది?

ఉపన్యాసం ఇవ్వమని ఎవ్వరూ పిలవరు. ఉపన్యాసాలకు ఎవరూ రారు. పాండిత్యం లేకపోయినా ప్రకర్ష ఉంటే చాలు. ఉపన్యాసం ఇవ్వడం అంటే మాటలు పేర్చుకుంటూ పోవడం కదూ ! ఎంత ముందుకు ? ఎంత మందిని ? ఇళ్లు కట్టుకున్నట్లే మాటలూ పేర్చుకుంటూ పోవచ్చును. ఆకాశహర్మ్యాలు నిర్మించుకుంటూ పోవచ్చు. గాలి మేడలు కూలిపోతాయి. పోనీ మామూలు మేడలయినా కూలకుండా శాశ్వతంగా ఉంటాయా? భూకంపం వచ్చినప్పుడు వాటి గతి ఏం అవుతుంది ? గాలి మేడ క్షణంలో కూలిపోతే మట్టిమేడ కొన్ని సంవత్సరాలు ఉండవచ్చును. రాతి మేడలు పునాదులు గట్టివయినా వందయేళ్ళు, పునాదులు కదిలించుకుని పెకలించుకుని మేడలు భూపతనం అవడం - గాలిలో కలిసిపోవడం - అంతరిక్షంలోకి అర్ధాంతరంగా అంతర్ధానం అయిపోయి కనబడకుండా పోవడం - జరగని సంగతులు కావు. రాతిమేడ కట్టుకుని రంగు రంగుల చిత్రాలు పులుముకుని శాశ్వతంగా కూర్చుందామనుకున్నా అది సాధ్యం అవుతుందా? అంతకంటే గాలిమేడే నయం, ఇష్టం వచ్చిన మార్పులు అనుక్షణం చేసుకుంటూ పోవచ్చును. ఎక్కువ కష్టపడకుండానే ఎన్నయినా 'ఆల్టరేషన్స్' చేసుకోవచ్చు.

'ముందుగా పునాదులు వేసుకోవాలి' - అన్నాడు ఇళ్లు కట్టడంలో ఎంతో అనుభవం ఉన్న ఒకతను వచ్చి. రావు అతన్ని దగ్గరకు జరిగి కూర్చోమన్నాడు. ఇళ్లు కట్టడాన్ని గురించి అతనికి తెలిసిదంతా చెప్పుతున్నాడు. 'మేడ ఎంత ఎత్తున కట్టాలనుకుంటున్నావో అంత లోతుగా పునాదులు తీసుకోవడం అవసరం' అని ఆ మనిషి చెప్పినప్పుడు, రావుకు ముందు అర్థం కాలేదు. పైకి పోవాలంటే లోతుకూ ఎదగాలి.

'చూడండి. ఇళ్లు కడుతూ ఉంటాం. పునాదులు తీస్తూ ఉంటాం. పై నుంచి ఎవడో అధికారి వస్తాడు. ఈ లోతు చాలదు, ఇంకా తవ్వమంటాడు. పునాది ఎంత గట్టిది అయితే అంత మంచిది. మంచితనం కోసం కాదు, మేడ పడిపోకుండా ఉండటానికి లోతుకు వెళ్ళడం తప్పని సరి అంటాడు అతను. ఇళ్లు కట్టేవాడి మీద పెత్తనం చేస్తూ ఎప్పటికప్పుడు ఏం చేయవలసిందీ చెబుతూ ఉంటారన్నమాట కొందరు. పునాదులు తవ్వుతూంటే ఒక్కోసారి తడి తగులుతుందట. ఆ విషయం జాగ్రత్తగా ఉండాలి - అన్నాడు, ఆ ఆసామి పునాదులు తియ్యడంతో సరిపోదు, గోడలు లేపాలి. ఎంత

ఎత్తుకు వెళ్లాలో నిర్ణయించుకోవాలి. గోడలు కట్టుకుంటూ ఇటుకలు పేర్చుకుంటూ పోవడం కాదు. ఎక్కడ ద్వారాలు, కిటికీలు రావాలో తెలుసుకోవాలి. అక్కడ ఇటుకలు పేర్చగూడదు. ఖాళీ స్థలం ఉంచాలి. అసలు ఇల్లు ఎక్కడ కడుతున్నాం ? మన ఇల్లు ఆ వాతావరణానికి నప్పుతుందా ? - నప్పకపోతే ఎలా మార్పాటు చేసుకోవాలి? - ఇంటినీ, వాతావరణాన్నీ !

'ఇల్లు' కట్టడం అంటే నిర్మాణశాస్త్రం ఒక్కటీ తెలిస్తే చాలదు. వాస్తు కూడా తెలియాలి. తూర్పు పడమర తెలియనివాళ్లే ఇప్పుడు మహాఘనులయిపోయి కోట్లకు పడగలెత్తుతున్నారు' - అన్నాడు అతను.

చాలా సేపు ఉపన్యాసం ఇచ్చి - చివరకు ఊపిరి తీసుకోవటానికి ఆగినట్లుగా ఒక్క క్షణం ఆగి, రావును మరోమారు ఎగాదిగా చూచి - ఇంతకూ మీరేం చేస్తూ ఉంటారు? అనడిగాడు. ప్రశ్న, జవాబు కోరే ప్రశ్న. ఇంతకూ మీరేం చేస్తూ ఉంటారు ? రావుకు గొంతుకు పచ్చివెలగకాయ అడ్డం పడ్డట్లు అయింది - ఎంతకూ ? ఎంత అర్థం ఉంది ఆ మొదటి మాటలోనే ! లోతంతా తెలిసిపోతోంది. ఎన్నో విషయాలు చెప్పాను గదా, ఇవన్నీ నీకు అర్థం అయినాయా ? నీకు అవసరమేనా ? ఊరికే నన్ను వాగిస్తున్నావా? నా సమయం వృథా చేశావా ? - ఇలా ఎన్ని రకాలుగానయినా అర్థాలు చెప్పుకోవచ్చు, 'ఇంతకూ' అన్న ఆ ఒక్కమాటకు.

రావు ఒకమారు తనను తాను పరికించుకున్నాడు. దుస్తులు సజావుగానే ఉన్నాయి. జేబు గడియారం టిక్-టిక్ మంటూనే ఉంది. 'ఉహు - ఏమి చేయను' అన్నాడు ముందు. ఏమి చేస్తున్నారంటే చేస్తున్న పని చెప్పాలిగాని ఏమీ చేయననడం ఏమిటి ?

తత్త్వవేత్తననీ, ఆలోచిస్తూ ఉండడమే పని అనీ చెప్పడం ఎలా ? చెబితే అతనికి అర్థం అవుతుందా ? ఎందుకు ఆలోచిస్తావు, నీకు భోజనం ఎలా వస్తుంది - అని అడుగుతాడు అవతలి మనిషి.

భోజన భాజనాల కోసం ఏం చేస్తాడో చెప్పడమే, మనిషి ఏం చేస్తున్నాడు? అన్న దానికి జవాబు అయిపోయింది. అంతకంటె మనిషికి వేరే అస్తిత్వం లేదు. ఆ మనిషి నవ్వాడు. 'భలే వారే మీరు ! ఏం చేయకుండా ఎలా ఉంటారు ? ఏం చేస్తున్నారో చెప్పండి' అన్నాడు, ఇంకా నవ్వుతూనే.

రావు తటపటాయిస్తూనే ఉన్నాడు. తరువాత నిదానంగా తల ఊపుతూ కొత్త ఎత్తు ఎత్తుతున్నట్లు 'రిటైర్ అయిపోయినాను' అన్నాడు.

టైర్ అయిపోవటానికి, రిటైర్ అయిపోవటానికి సంబంధం ఉందా? అని మనసులో కొత్త ఆలోచన మొలకలు ఎత్తింది.

'రిటైర్ అయిపోయారా ? చాలా సంతోషం' అన్నాడు ఆ ఆసామి.

మధ్య ఇతనికెందుకో అంత సంతోషం - అనుకున్నాడు రావు. అతను మాట్లాడడం ఆపలేదు. 'చక్కగా ఇల్లు కట్టుకోండి, హాయిగా ఉండండి. విశ్రాంతిగా ఉండాలి ఇల్లు. ఇరుగ్గా ఎలుక బొక్కలా ఉండగూడదు. ఏనుగులు హాయిగా వ్యాయామం చేయడానికి సరిపడా ఉండాలి హాలు, గదులు. మంచి ఫర్నిచర్ కొనుక్కోండి !''

అతను ఒక్క క్షణం ఆగి ఊపిరి బిగబట్టుకున్నాడు. ముఖంలో కొత్త కాంతి కనిపింప చేస్తూ : 'ఒక రహస్యం చెబుతా వినండి, నా మాట వింటారు గదూ' అన్నాడు. అలాగే - అన్నాడు రావు.

'కొంతమంది ఏం చేస్తారో తెలుసా ? హాయిగా పెద్ద ఇల్లు కట్టుకుంటారు. దానికి అమరే ఫర్నిచర్ కొనుక్కోరు. ఇల్లంతా వెలవెలపోతూ తయారవుతుంది. ఎందుకు అంటారు ? అతనో క్షణం ఆగాడు మళ్లీ రావు సమాధానం చెప్తాడని చూశాడు. 'చెప్పండి, మీకు తెలుసా ?'

నాకు తెలుసు. కాని ఈ సంగతి తెలియదు - అనుకున్నాడు రావు 'మీరే చెప్పండి' అన్నాడు బదులుగా.

చెబుతాను. కాని మీరేం అనుకోకండి. రహస్యం. మళ్లీ ఎవరితోనూ అనకండి. బాగుండదు'

రావు - నీ రహస్యాలు నేను కాపాడతాను, భయం లేదు - అన్న భావం కనపరచాడు ముఖంలో. అతనికి ఫరవా చిక్కినట్లు అయింది. చెప్పాడు ధైర్యంగా. 'ఇల్లు కట్టేటప్పటికి తైలం అయిపోతుంది. ఫర్నిచర్ కొనడానికి పైసలు ఉండవు. అప్పు చేయాలంటే - ఇప్పటివరకు చేసిన బాకీలే ఎలా తీరుస్తామా అని భయం గుండెల నిండా పేరుకుపోయి బాధపెడుతూ ఉంటుంది. అందుకని ఏమీ ఆలోచించటానికి .గూడా సమయం ఇవ్వలేరు. అదీ రహస్యం. ఇంతకూ మీరా పని చేయకండి.

ముందుగానే ఫర్నిచర్ కొనేసెయ్యండి - ఆ ! మీరు రిటైర్ అయినారు కదూ !

రావు మళ్లీ మనసులోకి వెళ్లిపోయాడు.

తాను తత్త్వవేత్త. పుస్తకాలు, కలం - కాగితాలు - ఆలోచనలు. ఎక్కువ సమయం ఆలోచనలతోనే గడిపి వేస్తానని ఇతనికి చెప్పడం ఎలా ? ఇతనికే కాదు. ఎవరికి మాత్రం చెప్పి అర్థం అయిందనిపించుకోవడం ఎలా ? సాధ్యం కాదు. అందుకని పైకి ఏమీ అనకుండా మౌనంగానే ఉండిపోయాడు. ఆ మనిషిని ఏమయినా అనుకోనీ. అతను చెప్పేది వింటూ కూర్చుంటే సరి !

అతను అంటున్నాడు : 'నేను ఒక రోజు ఎప్పుడో ఒకప్పుడు రిటైర్ అయిపోతాను. రిటైర్ అయిన తరువాత ఏం చేయాలి అని ఇంతవరకూ ఏమీ ఆలోచించుకోలేదు. ఇప్పట్లో రిటైర్ అవడం నాకూ ఇష్టం లేదు. కుదరదు కూడా. ఎన్నో బరువులు ఉన్నాయి, బాధ్యతలు ఉన్నాయి. ఇవన్నీ తీర్చుకోవాలి. అప్పుడే విశ్రాంతి. పిల్లల చదువులు, పెళ్లిళ్లు, కాపురాలు - ఇవన్నీ అవాలి. వాళ్లందరికీ ఇళ్లు కట్టిపెట్టాలి. అప్పుడే రిటైర్ అయి ఏం చేస్తాను ? ఇంట్లో ఆవిడకు ఎప్పుడూ కనిపిస్తూ అన్ని పనులకు అడ్డం వస్తానని అనిపించుకోమంటారా ? అన్నాడు అక్కడికి రావు తనను రిటైరయి పొమ్మని బలవంతం చేస్తున్నట్లుగా -

'ఈ ఆడవాళ్లు ఉన్నారు, చూచారా ! - ఎప్పుడూ ఒకటే నస వీళ్లతో. ఏం చేసినా వాళ్లకు తృప్తి ఉండదు. నా భార్యే ఉందా ? ఒక్క క్షణం అయినా ఇంట్లో ఉండరు, నాకు ఇంటి పనుల్లో ఏమీ సహాయం చేయరు, అన్నిటికీ నేనొక్కదాన్నే సతమతం అయిపోవాలి - అని దండకం చదువుతుంది, నేను కనిపించినప్పుడల్లా. పోనీ గదా అని ఒక్క గంట సేపు అన్ని పనులు మానుకుని ఇంటి పట్టునే ఉండిపోతే - ఎందుకట్లా ముంగిలా కూర్చుంటారు ? పనికి వెళ్లరేం ? - వెళ్లండి, వెళ్లండి - అనీ - అన్ని పనులూ చక్కబెట్టండి. వేలకు వేలు డబ్బు కావాలి. ఊర్కేకూర్చుంటే వస్తుందా డబ్బు. ఊ - ఊ - అనీ తొందర చేస్తుంది. ఇదీవాళ్ల వ్యవహారం. నవ్వాలో ఏడవాలో తెలీదు. అయినా నేను పట్టించుకోననుకోండి. చేయదలుచుకున్నట్లు చేసుకుంటూ పోతాను. నాకు మాత్రం తెలియదూ ? - ఎప్పుడు ఏ పని చేయాలో ! ఎక్కడ ఎవరిని చూడాలో అంటూ అతను ఓ కొత్త కోణం 'ఓపెన్' చేశాడు.

రావుకు ఇతను వెళ్లిపోతే బాగుండునని ఉంది. మళ్లీ వెళ్లిపోతాడేమోనని భయంగా ఉంది. కావాలి - అక్కర్లేదు. ఈ రెండూ ఒకే నాణెం రెండు పక్కలు బొమ్మ - బొరుసు! అసలు నాణెంకు రెడు పక్కలు లేవు. ఒకటే నాణెం.

అతను చెప్పుకు పోతున్నాడు.

'ఇళ్లు కట్టడం చాలా కష్టమయిన పని. మరో విషయం కూడా ఉంది, మీరు గమనించారో, లేదో !'

'ఉహు నేను గమనించలేదు' అని రావు సమాధానం చెప్పేంత వరకు అతను తరువాతి వాక్యం చెప్పలేదు.

'ఇళ్లు కట్టేపని ప్రతిచోటా ఎప్పుడూ ఉంటుందనుకోవటానికి వీలు లేదు. జనం దగ్గర బాగా డబ్బు ఉండాలి. ఆ డబ్బుకు ఇతర వినియోగం ఏమీ లేకుండా ఉండాలి. అంతేకాదు. ఒక్కోసారి ఒక్కో ప్రాంతంలో ఇళ్లు కట్టేపని జోరుగా సాగుతుంది. ఈ రాష్ట్రం వదిలేసి మరో రాష్ట్రానికి పోవలసి వస్తుంది నేను. అక్కడ ఇళ్లు కట్టుకుందామను కునే జనం ఎక్కువ ఉంటారు. కట్టించేవాళ్లు ఉన్నా, కట్టి ఇచ్చేవాళ్లు ఉండరు. కూలీలు దొరకరు. విశాఖపట్నం నుంచి తీసుకుపోవలసి వస్తుంది లారీల్లో కూలీలను. ఎక్కడి కనుకున్నారు ? కరీం నగరుకా ? కాదు, కాన్పూర్ దాకా గూడా. మన రాష్ట్రంలో కూలీలు మహారాష్ట్రంలో చాలా మంది ఉన్నారు. నేను చేసిన కాంట్రాక్ట్‌లే ఉన్నాయి చాలా.

'అయిదారేళ్లు ఇల్లు కట్టేపనిలో దేశమంతా తిరుగుతాను. అయిదారు లక్షలయినా మిగులుతాయి. అప్పుడు - అప్పుడు - స్వగ్రామంలో మా ఇంటిని సుకుమారంగా తయారు చేసుకుని అట్టే ఉండిపోతాను.'

పనికోసం వెదుక్కుంటూ దేశం అంతా తిరగడం అతనికి అలసట కాదు. పని దొరుకుతుందంటే చాలు, పరుగులు తీస్తూ వెళ్లిపోతాడు. ఒక్కోమారు సంవత్సరం దాకా ఇంటికి రాడు. ఇంటి దగ్గర ముసలి తల్లి దండ్రులకు అనారోగ్యంగా ఉన్నా సరే ! పిల్లల వ్యవహారాలు చూడవలసి వచ్చినా సరే ! కదలడానికి వీలుండదు, కట్టడాలు జరుగుతున్న చోటు నుంచి. అయినా కట్టడం పూర్తి అయిన తరువాత దాన్ని చూస్తూ నిలుచుంటే కడుపు నిండిపోతుంది.

'ఆ భవనం నాది కాకపోతేనేం ? నేను కట్టిందే !.నా చెమట, నా నెత్తురు ధారపోసి

ఈ భవనం నేలమీద నిలవడానికి కారణం అయ్యాను - ఎవరో స్వంతదారు. స్వంతదారు మారిపోవచ్చును. ఆస్తులు చేతులు దాటవచ్చును. కాని కట్టినవాడు మారటానికి వీల్లేదు. కట్టడం అయిపోయిన తరువాత కూడా ! - అతని పేరు ఆ భవనం మీద ఎవరూ రాయకుండానే అదృశ్యంగానే నిలిచి పోతుంది !'

అతని కళ్లల్లో ఆనందం చూచాడు రావు.

జగన్నిర్మాణం చేసిన సృష్టికర్త కూడా - విశ్వకర్మ కూడా - ఇలాగే ఆనందిస్తాడా? - ఈ ప్రపంచాన్ని చూచి ! అతన్ని ఎవరూ తెలుసుకోక పోయినా అతని సంతోషానికి, తృప్తికి తరుగు ఉండకుండా పోతుంది గావును !

జగన్నిర్మాణ కార్యం ఎంత పటిష్ఠమైనది !

రావు ఆలోచనల్లో మునిగిపోయి ఉన్నప్పుడు, ఆ మనిషి మేలుకొలుపుతూ ఇంకా ఇలా అన్నాడు.

'మీరు పుస్తకాలు రాస్తారు. మీకు అనేక సంగతులు తెలుసు !'

రావుకు ఆశ్చర్యం అయింది. 'నేను పుస్తకాలు రాయను. ఎవరు చెప్పారు మీకు అలాగని!'

'ఒకరు చెప్పాలా నాకు ? ఇంతసేపు మాట్లాడుతూ వచ్చాను, మీతో. మిమ్మల్ని గురించి అంత అంచెనా వేయలేననుకుంటున్నారా ? నేను చదువుకున్న వాడిని కాదు. ఇంగ్లీషులో సంతకం మాత్రం చేస్తాను. బిల్డింగ్ డిజైన్లు, ప్లాన్లు, అర్థం చేసుకో గలను. ఆ లెక్కడొక్కలు చూచుకోగలను. ఏమయినా మరీ అర్థం కాని సంగతులు ఉంటే మీ బోటి చదువుకున్న పండితుల దగ్గరకు వెళ్లి అడుగుతాను.

'నేను పండితుడిని కాను. నాకు ఆ నిర్మాణ సూత్రాలు చదవడం, అర్థం చేసుకోవడం అస్సలే చేతకాదు -' అన్నాడు రావు భయపడుతూనే.

'అలా అన్నిటికీ కాదనకండి, బాగుండదు. అయినా, ఇప్పుడు మిమ్మల్ని నేనేమీ చదివి చెప్పమనడం లేదుగా. నా సంగతి చెప్పుకుంటున్నాను, అంతే-' అన్నాడు ఆ మనిషి.

బతికించాడు ! తన బండారం బయట పడకముందే తిన్నగా తప్పుకుంటే మంచిది. రావు లేచాడు. అతనూ లేచి నిలబడ్డాడు. 'ఇంక వెళ్లిపోదాం - అంటారా?

రేపు గనుక మీరు కనిపిస్తే మరో మనిషిని చూపిస్తాను. వాడు నా కంటె మొరటువాడు. మాట్లాడటం కూడా సరీగ్గా రాదు వాడికి. కాని అంతలో ఏమయింది ? ఓ యంత్రం చూపించండి. అది కదలకపోతే ఎందుకు కదలడం లేదు - దాని ముఖం చూచి చెప్పేస్తాడు. మిషనంతా విప్పనవసరం లేదు. తరువాత మీరు ఎవరో పెద్ద ఇంజనీయర్‌ను పిలిచి మిషనంతా విప్పి చూపించుకుంటారు. ఆ మనిషి చెప్పిన 'మిస్టేకులే' లోపల కనిపిస్తాయి. మిషన్ బాగుంటే పాడు చేస్తాడు, పాడయిపోతే బాగు చేస్తాడు. బాగా ఉన్నప్పుడు ఎవరూ అతన్ని దగ్గరకు రానివ్వరు. ఒక తులం నల్ల మందు ఇచ్చి దూరంగా పంపేస్తారు. మిషన్ చెడిపోయినప్పుడు మాత్రం విమానంలో తీసుకుపోయి అతని చేత పని చేయించుకుంటారు. అంత గురి అతనంటే ! ఏమనుకున్నారో !'

రావుకు ఆశ్చర్యం అనిపించింది. ఈ ప్రపంచంలో ఎంతటి జగజ్జట్టీలు ఉన్నారు! అందరూ మహానుభావులే !

ఇద్దరి దారులూ చీలాయి.

రావుకు కొత్త విషయాలు బుర్రలో చేరాయి. గందరగోళం చేస్తున్నాయి. ఎన్ని విషయాలు ఉన్నాయి ! తనకు తెలియనివి . ఇళ్లు కట్టేవాళ్లు, కాలువలు తవ్వేవాళ్లు, వంతెనలు వేసేవాళ్లు, మహాసముద్రంలో లోతులకు వెళ్లి రత్నాలు మాణిక్యాలు తీసుకు వచ్చేవాళ్లు ఎందరో ! ఎందరో !!

మరోసారి ఆకాశం నిర్మలంగా ఉంది. నక్షత్రాలు ధగధగ మెరుస్తూ విత్తనాల్లా వెదజల్లినట్లు ఆకాశం అంతటా పరుచుకు ఉన్నాయి.

ఈ నక్షత్రాలకు పేర్లు ఉన్నాయి. పుట్టుకలు ఉన్నాయి. పూర్వాపరాలు ఉన్నాయి. ఒక్కోనక్షత్రం ముందు ముందు ఒక్కోమహా విశ్వం అవుతుందట ! ఎంతవైశాల్యం! ఎంత దీర్ఘమైన దూరం, సమయం. వైశాల్యం, సమయం కాకుండా 'గమనం' ఒకటుంది. ఆ గమనమే విశ్వానికి ఆయువు పట్టు. ముందుకు - ముందుకు - మహా ముందుకు !

మనిషిమనుగడకు ఈ మూడూ కావాలి.

తిండి - బట్ట - గూడు అనవచ్చు కొందరు. భోజనం - నిద్ర - షికారు అనవచ్చు మరికొందరు. అంతకంటే ప్రధానమైనవి వైశాల్యం - సమయం - గమనం. ఇవి

లేకపోతే మనిషి ఉన్నచోటనే ఉండిపోతాడు. నిలవబడి మగ్గిపోతాడు. ఇవి ఉన్నాయి గనుకనే తేజోవంతంగా ప్రయాణం చేస్తున్నాడు.

గడియారం చూచుకున్నాడు రావు.

తొమ్మిది గంటలు. నడుస్తున్న రావును ఎవరో ఆగమన్నారు. 'ఎక్కడికి ఇంకా వెళ్లిపోతున్నారు ? కాస్సేపు రండి. కాలక్షేపం చేసి పోండి. సుఖంగా నిద్రపడుతుంది' అంది ఆమె.

'భలే మంచి సమయం - మించినన్ దొరకదు
త్వరన్ పడుడు సుజనులార' - అని రాగయుక్తంగా పాడుతోంది ఆమె. రావు తేరిపార చూచాడు. ఆ పాట మంచి స్ఫూర్తి దాయకంగా ఉంది. నవ్వుతోంది ఆమె. బుగ్గలు కెంపులు. చేతులు కాళ్లు దృఢంగా ఉన్నాయి.

ఎందుకు ? ఎందుకు ? గొణుగుతున్నట్లుగా అన్నాడు.

'టైమా అడుగుతున్నారు ? తొమ్మిది గంటలయింది' - అన్నాడు. ఆమె అతని వంక అయోమయంగా చూసింది. నిరసనగా కళ్లు తిప్పేసి చేతులు ఊపుకుంటూ ముందుకు నడిచి వెళ్లిపోయింది. .

అమ్మయ్య. రావుకు విశ్రాంతి. మీద పడబోతున్న భయం మబ్బులు తొలగిపోయాయి. ఏదో గాలి. ఒక్కమారు అలా వీచి వెళ్లిపోయింది. ఆ వేగంలో తాను కొట్టుకుపోలేదు. అంతేచాలు !

మళ్లీ ఆకాశం వంక చూచుకున్నాడు. ఆకాశం ఈ మారు అనేక రంగులు పులుముకుంటూంది. ఆ రంగులు క్రమంగా ఆకారాలు తాల్చి భూమి మీదకు వస్తున్నట్లున్నాయి. మనిషి స్వేచ్ఛను గురించి, ఇష్టాన్ని గురించి, తనతో వాదించటానికి వస్తున్నట్లున్నాయి ఆ రంగులు.

నడవడం ఈ రోజు ఆరంభం చేయలేదు. అయినా ఈ రోడ్డుకు ఎలా వచ్చి పడ్డాడు ? విచిత్రం ! ఇంకేదో చేసి ఉంటే బాగుండేది. మరేదో పద్ధతిలో ప్రవర్తనమప్పితంగా ఉండేది !

పవిత్రత. పవిత్రత చెడటానికి వీల్లేదు. మచ్చలు రాగూడదు. మచ్చికల వల్ల మాయల్లో పడగూడదు. గడియారం గట్టిగా పట్టుకున్నాడు. ఎంతో సరళంగా ఉండాలి

జీవితం. సూటిగా ఉండాలి. వంకర టింకరలు పనికిరావు. పోకిరీ వేషాలు అసలే దరికి రాకూడదు. ఈ ప్రపంచంలో ఉంటూ ప్రభంజనంలా వెలిగిపోవాలి తప్ప ప్రమాదాలతో ఇరుక్కుపోగూడదు. జీవితం బుద్బుదప్రాయం. నీటిబొట్టు ఆకును అనుకునే ఉన్నా, ఏ క్షణమైనా తన స్థానం నుంచి పడిపోవటానికి తయారుగానే ఉంటుంది.

జీవితంలో మనిషికి ఉండాల్సిన పద్ధతీ ఇదే.

అనుక్షణం - ఉండటానికీ, ఊడటానికీ తయారు.

చెడ్డ చేయడం చేతకాకుండా పోవడం సహజాతం.

ప్రపంచంలో ఉంటూ పవిత్రతను కాపాడుకోవడం ఎట్లా ? పాప పంకిలంలో కూరుకు పోకుండా పంకజంలా పైకి తేలియాడడం ఎట్లా ?

• • •

గడియారాన్ని గట్టిగా పట్టుకున్నాడు. గుండ్రటి బంగారు గడియారం. ఖచ్చితంగా నిర్మొగమాటంగా ఉన్నది ఉన్నట్లుగా సమయాన్ని తెలిపే సూచిక. హృదయానికి చేరువగా ఉండి ప్రతి లిప్తకూ టక్‌టక్‌మని చప్పుడు చేసుకుంటూ సమవర్తిలా నడిచి పోయే గడియారం. జేబు గడియారం. తాత ముత్తాతల నాటి విలువయిన గడియారం.

హృదయం లాగే చప్పుడు. కాకపోతే ఒక్కటే తేడా. హృదయాన్ని మార్చటానికి వీల్లేదు. గడియారాన్ని ఎప్పటికప్పుడు కొత్తగా తయారు చేసుకోవచ్చు.

ఓ రోజు - రాత్రి వీధి వెంట ఒంటరిగా పోతూ ఉన్నప్పుడు ఒక ఆమె తారస పడింది. ఆమె ముఖం కొట్ట వచ్చిన్నట్లుగా అనిపించింది. అదేమిటి ఆ ముక్కు ? అంత పొడుగ్గా, చివరలో మొనతేలి తగు మాత్రం వంకర తిరిగిపోయి పొడుచుకు వస్తున్నట్లుగా ఉంది. చిన్నప్పుడు చదువుకున్న కథల పుస్తకాలలో మాంత్రికురాలి బొమ్మలా ఉంది ఆమె. మంత్రగత్తె కళ్లతో చూచి రూపాలను మార్చివేయగల దిట్ట. పరుగెత్తే తివాచీలు, పాదాల చడావులు ఇష్టా మాత్రంగా ఇవ్వగల మనిషి. రాక్షసుడిని, రాజకుమారుడిని దూరంచేసి, కలిపీ - మొదటి వాడిని రెండోవాడితో చంపించగల చాకచక్యం ఉన్న చమత్కారి. మంత్రగత్తె. ముక్కు ఎప్పుడూ అట్లానే ఉంటుంది

బొమ్మల్లో. నిజంగా అలాంటి వాళ్లు ఉంటారా ? పిల్లలకు ఉల్లాసంగా కనబడడానికి, ఉత్సాహంగా చదివించుకు పోవటానికి అటువంటి కథలు కల్పిస్తారు - ఊహాశక్తి ఎక్కువయి పోయిన రచయితలు.

రావు ఆ మనిషిని ఎరుగును. ఆమె మంత్రగత్తె కాదని తెలుసు. ఎంత తొందరగా భ్రమల్లో పడిపోయినాడు ! మంత్రగత్తెలు, మంత్రాలు, తంత్రాలు - లేవు. మంత్రాలకు చింతకాయలు రాలుతాయా ? ఏవో ఊహలు - కల్పనలు - కాస్సేపు జనాన్ని నవ్వించటానికి, వమ్మించటానికి, నయ వినయాలు నేర్పించటానికీని !

ఆమె దురుసుగా నడుచుకుంటూ పక్కనుంచి వెళ్లిపోయింది. కోపం ఉన్నట్లుంది. చీపురుకట్ట తీసుకుని ఆకాశాన్ని, భూమిని విడివిడిగాను కలిపికట్టుగానూ ఊడ్చి వేయాలన్న ఉద్దేశ్యంతో ఊగిసలాడుతూ వెడుతోంది. ఏ క్షణంలోనయినా ఉద్రేకం తెచ్చుకుని బండబూతులు, కారుకూతలు మంత్రాలలా ఉచ్చరించటానికి తయారయి నట్లుగా ఉంది. అదృష్టం కొద్దీ తనను చూచి ఆమె నోరు విప్పలేదు. తత్త్వవేత్తను ఎంత దూరంగా ఉంచాలో ఆమెకు బాగా తెలిసి ఉండాలి. వేదాంతులు వస్తున్నారు, వెండిబంగారాలు భద్రపరుచుకోండి - అని నానుడి, హెచ్చరిక. అందరూ కైంకర్య పరులే ! ఎవరి కింకరులో మాత్రం తెలీదు. ఒకపట్టాన అర్థం కాదు.

అనివార్యం అన్ని పనులనూ శాసిస్తుంది.

విధాయకం అన్నిటినీ సాధిస్తుంది.

దాన్ని తప్పించటానికి చూస్తున్నాడు, తపిస్తున్నాడు.

అనుకునేది - అనబోయేది ఒక్కటే అయిపోతే ఎంత ప్రశాంతంగా ఉంటుంది మనస్సు, వాతావరణం !

ఎదురుగా ఉన్నదీ, ఎన్నుకున్నదీ ఒక్కటే అయిపోతే !

జీవితంలో ఘర్షణ - సంఘర్షణ !

ఎన్నో సంగతులు ఉన్నాయి - ఆలోచించుకోవలసినవీ; అంతు తేల్చుకోవలసిన వీని!

నక్షత్రాల వెనుక ఏదో బలం ఉంది, బలగం ఉంది. ఇళ్లవెనుక ఇంకేదో ఈప్సితం ఉంది. భూగర్భంలో - విశాల విశ్వం నడుమకు చిల్లు చేసుకు పోగలిగితే - ఇంకేదో

కనిపిస్తుంది. భూమికి పాతాళం దగ్గర. పాతాళానికి దిగువన ఇంకా ఎన్నో తలాలు. అతలం వరకు విస్తరిస్తుంది. ఏమీ లేనంత వరకూ వ్యాపిస్తుంది. ఇటు లోకాలను - తలాలను గుండ్రంగా తనలో ఇముడ్చుకున్న గ్లోబ్ మీద ఊహారేఖలు. గ్లోబ్‌కు 'సెంట్రల్ పాయింట్' దగ్గరకు చేరుకోగలిగితే! అక్కడి నుంచి అన్నిటినీ పరిశీలనగా చూడగలిగితే ఇంకా ఎంత ఘనంగా ఉంటుందో! దృష్టికోణం మరెంత పదునయిపోతుందో. ఆ కేంద్ర బిందువు నేను తాకినా - తాకకపోయినా సదా నన్ను కనిపెడుతూనే ఉంటుంది. నన్ను చూచి నవ్వుకుంటూనే ఉంటుంది. ఏమిటీ పిచ్చి మనిషి! గుండ్రటి బంగారు గడియారం జేబులో పెట్టుకుని తిరుగుతూ, కాలగమనం అంతా తనకు అర్థం అయిపోయినట్లు ప్రవర్తిస్తున్నాడు! గ్లోబ్ బల్ల మీద ఉంది గనుక అంతా తనకు 'కరతలామలకం' అయిపోయినట్లు తలపోస్తున్నాడు.

కేంద్రబిందువు తనను జాలిగా, సానుభూతిగా చూస్తున్నట్లు అనిపించింది. దాని అస్తిత్వాన్ని గమనించిన వాళ్ల పట్ల అనుకంప. కాని అస్తిత్వాన్ని గురించి ఊహాపోహలు చేసుకుంటూ ఊసులాడే వాళ్ల పట్ల పరామర్శ! దాని దృష్టి వేరు, దాని స్పర్శ వేరు, దాని దర్శనం వేరు. మూలాలలో లోతుగా కూరుకు పోయి, విస్తృతి అంతా తానే అయిపోగల కేంద్ర బిందువు.

ఆకాశంలో ఓ పచ్చని పాము తిరుగాడుతున్నట్లు అనిపిస్తోంది. ఊహా జనితం అయినదే. యథార్థంగా ఉండక పోవచ్చు. కాని ఆ మెలికలు, మెరమెరలు కళ్లకు దిగ్భ్రమ కలిగిస్తూ నిజం - నిజం అనిపిస్తున్నాయి.

అకస్మాత్తుగా భయం అనిపించింది.

రావు కంపించి పోయాడు.

నిలువెల్లా వణికిపోతున్నాడు. చేయి జాపి పరిశీలనగా చూచుకుంటే చేతివేళ్లు కొంకర్లు తిరిగిపోతూ కనిపిస్తున్నాయి. ఎంతసేపు నిదానంగా చూచినా ఆ తిరిగిపోవడం, అతలాకుతలం నరాల నృత్యం ఆగిపోలేదు. సూదంటు రాయి, స్ఫూర్తి కోల్పోయి నట్లు అయింది.

ఓ ముసలామె బజార్న వెడుతోంది.

చేతిసంచి, వానిటీ బాగ్, ఆమెకు 'వానిటీ' ఉందో లేదో తెలియదు గాని వానిటీ బాగ్ మాత్రం ఉంది.

ఇద్దరు పిల్లలు పరుగులు తీసుకుంటూ వచ్చారు. ఆమెను ఢీ కొన్నారు. ఆమె చేతి సంచి ఊడలాక్కుని అదే పరుగు ! చీకటిలో కలిసిపోయారు, చిందులు తొక్కుతూ, గుహలో దాక్కున్న గువ్వపిట్టల్లా మరుగయిపోయారు.

ముసలామె దుఃఖంతో పైకే ఏడుస్తోంది.

రావు ఆమెకు దగ్గరగా వెళ్లాడు.

ఓదార్పు మాటలు చెప్పాడు. భుజం తట్టి ఊరట కలిగించాడు. ఇదుగో ఈ కాస్త డబ్బు తీసుకో - అని తన దగ్గరున్న కాగితాలు అందించబోయాడు.

ఆమె అందుకో లేదు, అంత తేలికగా.

'ఊహు, నాకు ఒద్దు. ముష్టి - యాచన నాకు చేతకాదు. ఎవరికీ ఋణపడి ఉండను. ఈ జీవితం అంతా అలాగే గడిపివేస్తాను. నాకు దానధర్మాలు చేయకండి-' అంటుంది ఆమె ఏడుస్తూనే.

ఎవరు ? ఎవరు ? - రావు ప్రశ్నించుకున్నాడు.

'నేనెవరికీ చిల్లి గవ్వయినా బకాయిలేను. ఋణగ్రస్తంగా పోవడం నాకు ఇష్టం లేదు. నేను చూచాను ఆ ఇద్దరు.పిల్లల్నీ. ఇద్దరూ ఆడపిల్లలు -' అంటూంది ఆ ముసలామె; తన బాగ్ దొంగిలించుకు పోయినవాళ్లను 'అయిడెంటిఫై' చేస్తూ.

'ఒకబ్బాయి, ఒకమ్మాయి -' అని సవరించాడు రావు. అతడూ ఆదృశ్యం, సన్నివేశం ప్రత్యక్షంగా చూడగలిగాడు. ఇంకా మనసులోనే సుభద్రితం అతనికి.

'కాదు - కాదు. వాళ్లు ఇద్దరూ ఆడపిల్లలే. పదిహేను, పదిహారు ఏళ్ల పిల్లలు. దూసుకు పోతున్న గాలిలాగ వచ్చారు. సంచి సంపాదించి పారిపోయారు. కళ్లారా చూచాను. నాకు ఇదెందుకు జరగాలి ? నేనెవరికీ అపకారం చేయలేదు. ఎవరి ఆస్తులూ దోచుకోలేదు -' ఇలా చెప్పుకుంటూ పోతోంది ముసలామె.

రావు అనివార్యంగానే వింటున్నాడు.

ఆమెకు సహాయం చేయడం తనకు విధాయకం.

'అబ్బే. అంతపెద్ద వాళ్లు కాదు. పదేళ్ల కంటే ఎక్కువ ఉండవు. ఇద్దరూ ఆడపిల్లలు కాదు. ఒకబ్బాయి, ఒకమ్మాయి నేను స్పష్టంగా చూచాను గదూ ---'

'కాదు, కాదు, ఇద్దరూ ఆడపిల్లలే. నన్ను కన్ఫ్యూజ్ చేయడానికి ప్రయత్నించకు.

ఇద్దరూ ఆడపిల్లలే. పదహారేళ్ల వాళ్లు. నాకు బాగా తెలుసు-' దబాయించి మరీ చెబుతోంది ముసలామె.

ఎన్నిమార్లు ఆమె అభిప్రాయం సరిచేసి నిజం ఎరుక సరుద్దామన్నా వినిపించుకునే ధోరణిలో లేదు. రావుకు చిరాకు అనిపించింది ఆమె ధోరణి. కోపం తెప్పించింది ఆమె. ఆ ఇద్దరు పిల్లలూ పదేళ్ళ కంటె పెద్దవాళ్లు కాదు. రావుకు దృఢంగా తెలుసు. ఎంతసేపూ ఈ 'నిజం' వక్కాణించటానికి చూచినా ముసలామె ఏడుపు ఎక్కువ చేసుకుంటుందేగాని, తన భ్రమను సరిపరచుకోదు, తొలగించుకోదు.

వాళ్లు పదేళ్ల పిల్లలు. ఎర్రటి దుస్తులు వేసుకున్నారు.

'కాదు - కాదు. వాళ్లు వేసుకున్న దుస్తులు పచ్చరంగు. ఆకుపచ్చ రంగు. ఎరుపు కానే కాదు. నా కళ్లు ఇంకా తిన్నగానే ఉన్నాయి. నాకేం చత్వారం లేదు. పొరలు అంత కన్నా లేవు. సూదుల్లా నా కళ్లు ఇంకా బాగానే ఉన్నాయి. వాళ్లు ఆకుపచ్చ రంగు దుస్తుల్లోనే ఉన్నారు.'

ఆమె రావును అమాంతం మీద పడి కొట్టేసేట్లు, కొరికేట్లు తయారయింది.

'నాతోపాటు నీవూ పోలీస్‌స్టేషన్‌కు రావాలి. నా కేసుకు సాక్ష్యం నువ్వే' అంది.

'ఉహు. పోలీసుల దగ్గరకు రాను. నా అన్వేషణ, వాళ్ల వెదుకులాట ఒకటి కావు. నేను పోలీసులు, రుజువులు, సాక్ష్యాలు, కేసులు, తీర్పులు - వీటికన్నిటికీ దూరం. బహు దూరం!'

ఈ ముసలామె ఎంత అంధురాలు! ఆకుపచ్చ రంగు దుస్తులు అంటుంది, రక్తంలా ఎర్రటి దుస్తులు వాళ్లు వేసుకుని ఉంటే.

ఎంత చీకటి అయినా, ఎంత చూపు ఆనకపోయినా ఇంతగా రంగు వ్యత్యాసం చెబుతుందే! పైగా చెబితే వినిపించుకోదు; సవరించుకోదు; వాదులాడుతుంది. వాగ్వివాదం చేస్తుంది.

ఫ్యాక్టరీని గురించి వాదులాడుతూ మాట్లాడినా ముసలామె కూడా ఈమేనన్న సంగతి స్ఫురణకు వచ్చింది రావుకు.

'ఆ కల్మషం, ఆ వాసనలు - దుర్భరం - మనం దాన్ని తట్టుకోలేం. మన మధ్య ఈ పొగగొట్టాలు ఉండటానికి వీల్లేదు. వీటిని పని చెయ్యనివ్వగూడదు' అంటూ ఏకబిగిని పెద్ద ఉపన్యాసం ఇచ్చింది అప్పుడు.

ఇప్పుడు పోలీస్‌స్టేషన్‌కు రమ్మంటోంది. పోలీసులతో వ్యవహారం. పొసగని పని. ఆ మాట ఆమె ఇంకాస్త గట్టిగా అడిగితే ! తనను రమ్మని పట్టు పట్టక ముందే ఇక్కడ నుంచి జారుకోవడం ఉత్తమం అయిన పని. బోలెడంత పని ఉంది. ఎన్నో విషయాలు ఆలోచించుకోవాలి. పోలీసుల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరుగుతూ కూర్చోవటానికీ. కాలయాపన చేయటానికీ సమయం లేదు.

ఈ మతి స్థిమితం లేని ముసలామెతో తాను ఎక్కువ జోక్యం పెట్టుకుంటే - ఈమె 'ఆ దొంగతనం చేసింది ఇతనే'నని పోలీసులకు చెప్పినా చెబుతుంది. గుడ్డిగా వాదిస్తుంది. అందరినీ వేధిస్తుంది.

భూమి కంపించిపోయినట్లు అనిపించింది రావుకు.

భూమి తన ఆకారాన్నే మార్చుకున్నట్లు తోచింది.

రావుకు తలతిరిగి పోతోంది. దుస్తుల వంక చూచుకున్నాడు. వీధి దీపాల కాంతిలో అవి పసుపు పచ్చగా మెరుస్తున్నాయి. ఏదో హాస్యగాడిలాగ, బఫూన్‌లాగ అనిపిస్తున్నాడు ఈ దుస్తులలో.

. జేబు గడియారం గుండ్రంగా దట్టంగా చేతికి తగులుతోంది.

పైకి తీసి ఒకమారు సమయం కూడా పరికించి చూచుకున్నాడు.

గడియారం తన వంక తేరిపార చూస్తున్నట్లు అనిపించింది. బంగారు గడియారం. బంగారం లాంటి గడియారం.

ప్రాణప్రదం అయిన వస్తువు. చంద్రుడి చల్లని వెన్నెలలో ఆ వస్తువును భద్రంగా మళ్లీ జేబులో పెట్టుకున్నాడు.

'భలే మంచి సమయము - మించినన్ దొరకదు-'

కొన్నాళ్ల క్రితం విన్నపాట మళ్లీ చెవుల్లో సోకింది.

అదే గొంతు , అదే రాగం, అదే తాళం.

శ్రుతి మాత్రం కాస్త ఎక్కువగా ఉంది.

ఆమె మళ్లీ ముందుకు వచ్చి నిలుచుంది. ఆపాట పాడి తనను ఆకర్షించడానికి ఇది వరకు ప్రయత్నం చేసిన దృఢమైన వయసు మనిషి! తన ముఖం లోనికి గుచ్చి చూచింది ఈ మారు.

'త్వరన్ పడుడు - సుజనులార -' అనే పదాలు నొక్కిచెబుతోంది. త్వరిత పరుస్తోంది.

ఆమె వంక తేరపార చూచాడు రావు.

ఆమె అక్కడే నిలబడి ఉంది. ముగ్ధ మనోహరంగా నవ్వుతోంది.

ఎప్పుడూ అక్కడే నిలబడి అందరినీ ఆహ్వానిస్తూ ఉన్న మనిషిలా అనిపించింది.

బొమ్మ - బొరుసు ఆడుకుందాం, రమ్మంటోంది. నాణెం సంపాదించారు.

'ఏమిటి రూల్స్ ఆఫ్ ది గేమ్?' అనడిగాడు.

'చాలా సింపుల్. పెద్దగా రూల్స్ అంటూ ఏమీ లేవు. ఆట ఎవరయినా ప్రారంభించవచ్చు. మొదటి మారు మీరు నాణేన్ని ఎగరేయండి. అది తప్పని సరిగా కిందపడుతుంది గదూ ! న్యూటన్ మీద గౌరవం కొద్దీ అయినా అది కింద పడవలసిందే. ఏ గద్దా దాన్ని ఎత్తుకు పోదు' అంటూ ప్రారంభిస్తుంది ఆమె. బాగా చదువుకున్న మనిషి అని అవతలి వాడు గుర్తించాలని తపన.

ఆమెకు 'సింపుల్ రూల్స్' చెప్పడమే బోలెడంత టైం పట్టేట్లుంది.

'ఊ - తరువాత --?'

'నాణెం కింద పడిందా ? మనకు నాణేనికి ఒక పక్కే కనిపిస్తుంది గదా. ఒప్పుకుంటారా ఆ విషయం ?'

ఇందులో ఒప్పుకోకుండా ఉండటానికి ఏమీ దొరకదు, కనబడదు - ఎవరికీ.

'మనకు కనిపిస్తున్నది బొమ్మ - బొరుసా చూడాలి.'

మరింత ఉత్సాహంగా వినాలనిపిస్తోంది ఆమె చెబుతున్నది.

ఆమె చెప్పడం సాగిస్తుంది : 'బొమ్మ గనక పడినట్లయితే నేను గెలిచినట్లు. బొరుసు కనుక కనబడిందంటే మీరు ఓడిపోయినారన్న మాట'.

ఓహో ! ఇంతేనా ? నిజంగా ఇది సింపుల్ గేమ్ !

ప్రతిమారూ అతనే సోలి పోతాడని వేరే చెప్పాలా ?

- ఆమె వెళ్లడం, మళ్లీ రావడం అంటూ ఏం లేదు.

ఎప్పుడూ ఇక్కడే ఉంది. ఎప్పుడూ అంతటా విస్తరించి ఆక్రమించుకుని ఉంది. అంగాంగ ప్రదర్శనలు చేస్తోంది, యాథాలాపంగా అన్నట్లుగా, అది తన ఉద్దేశ్యం కాదన్నట్లుగా.

తన దగ్గర ఉన్న వస్తువులు ఇతరులకు చూపించాలని ఆతురత. ఈ వస్తువులు తనవే. ఇతరులు తీసుకు పోగూడదు. ఎప్పటికీ తన దగ్గరే ఉండిపోవాలి. అయినా అందరికీ వీటి ప్రాశస్త్యం తెలియాలి. ఉపయోగం చేతికి రావాలి - ఇదీ తపన, ఈ ప్రపంచంలో ప్రతి మనిషికీ. తనదే. తనదేనని అందరూ గుర్తించాలి. స్వంత దారును గమనించాలి; గౌరవించాలి.

రావుకు ఈ పరిస్థితి, మనః స్థితి చాలా సజావుగా స్వాత్వికంగా అర్థం అయినాయి.

ఆమె ఇంకా ఇక్కడే ఉంది. నవ్వుతోంది. పువ్వులా విచ్చుకుంటూంది. వాసనలు విరజిమ్ముతోంది. చేతులు దూరంగా చాచి విశ్వమంతటినీ ఆలింగనం చేసుకుంటూంది.

విధాయకంగా ఆమె వెంట నడచి వెళ్లాడు.

అనివార్యం ఇది - అనివార్యం ఇది - అని తనకు తాను ప్రగాఢంగా చెప్పుకున్నాడు.

నిద్రలో గూడ ఇవే మాటలు అతనికి.

ఆమె ఉలిక్కిపడి అతనేం అంటున్నాడో గమనించాలనీ, అర్థం చేసుకోవాలనీ ప్రయత్నం చేసింది. అతన్నీ అతని దుస్తుల్నీ అప్పుడు మరింత విశ్రాంతిగా పరిశీలనగా చూచింది.

తప్పించుకోవటానికి వీల్లేని పరిస్థితిలో -

తప్పని సరిగా చేయవలసిన పనుల్లో చిక్కుకుపోయి -

ఈ మనిషి నీరసంగా పక్కమీదకు వాలిపోయి నిద్రకు పడ్డాడు. పసి పిల్లవాడిలాగ - పసిడి మెరుగులు, గులాబీ సౌరభాలు ఆ గదిలో మెత్తటి పక్కమీద మేను. విశ్రాంతి పొందుతూంది.

మనస్సు ఏం ఆలోచిస్తోందో ! సుషుప్తిలో ఉందో ఇంకా కలలలోనే చిక్కుకుపోయి పరిభ్రమిస్తోందో ! స్వప్న సుషుప్తులను దాటి తురీయానికి వెళ్లిపోయిందో !

ఆమె అతన్ని పసిపిల్లవాడిని జోకొట్టినట్లు లాలించింది. తన కాళ్లు చేతులు విస్తారంగా పరుచుకుని అతన్ని అలవోకగా దగ్గరకు తీసుకుంది. ఆమె శరీరంలో ఎంతో శక్తి, ఎంతో దారుఢ్యం.

నిండుగా పుష్టిగా ఉన్న మనిషి.

కండలు కండరాలు తేజస్సుతో తుళ్లిపడుతున్నాయి. ఎగసిగసి పడుతున్నాయి.

ఆమె అంతా స్పృహలోనే ఉంది. ఏ మాత్రం ఆభాస కాదు. అంతా నిజం. ఆ సమయంలో ఆమెకు కాలమూ, వయస్సు, విరామము, స్ఫురణకు రావు. కాల ప్రవాహాన్ని గురించి, గమనాన్ని గురించి ఆలోచనలు వేధించవు. డబ్బు ఉంటే - చేతి నిండా, పుష్కలంగా డబ్బు ఉంటే - మనిషి చేయలేని దంటూ ఏం ఉంటుంది ?

డబ్బుకు అన్ని దండోరాలూ దాసోహం.

భవిష్యత్తును గురించి భయపడుతూ, కలలు కంటూ ఆలోచించవలసిన నిమిత్తం ఉండదు, హాయిగా తన వశంలో డబ్బు ఉంటే ! భవిష్యత్తు దానంతట అదే యాంత్రికంగా, యాథాలాపంగా గడచిపోతుంది.

తత్త్వవేత్త పసిపిల్లవాడిలా నిద్రపోతున్నాడు.

ఆమె చూచింది అతన్ని - పసిపిల్లవాడిలా, పనిపిల్లాడిలా !

చూచిన కొద్దీ ఆమెకు ఆగ్రహం కూడా కలుగుతోంది.

ఈ మనిషి ! ఈ దుస్తులు ! ఈ డాబు ! ఈ సుకుమారం ! ఈ సుషుప్తి ! -- ఇతని దగ్గర డబ్బు ఉండడమేం ? తన దగ్గర లేక పోవడమేం ? ఇదేం తత్త్వం ఈ లోకంలో !-- అందరికీ సమానంగా ఏమీ ఉండవు; అందరూ సమానులే అయినా.

ఇతని దగ్గర డబ్బు విరివిగా ఉంటుంది. తన దగ్గర కంటే ఎక్కువగా మిన్నగా ఉండి ఉంటుంది. సందేహం లేదు.

తన దగ్గర తనువు మాత్రం ఉంది.

తనువులో తమకాలు మటుకే తెలుసు తనకు.

తనువులో తత్త్వాలు తెలుసునేమో ఈ మనిషికి ! పిల్లవాడిలా అన్నీ మరిచి - శరీరం విరిచి - నిద్రపోతున్నవాడికి.

అతని శరీరం - అంత దృఢమైనది కాదు. దుస్తులు డాబుగా వేసుకున్నాడు గాని, ఈ దుస్తుల వెనకాల శరీరం అంత బలమైంది కాదు. బరువైంది కాదు. బేలతనం ఇతనిలో స్పష్టం.

ఆమె ఆకాశం వంక చూచింది, తెరిచి ఉన్న కిటికీ రెక్కల మధ్య నుంచి. ఓ ఒంటరి

నక్షత్రం వెలుగుతూ కనిపిస్తోంది. ఆ నక్షత్రం 'శుక్రుడు' కావచ్చును. ఏమో - తనకు అంత నిశ్చయంగా, ఖచ్చితంగా తెలియదు.

చిన్నప్పుడు అమ్మ నక్షత్రాలు, వాటి పేర్లు చెప్పింది.

గ్రహాలు, గ్రహగతులు వివరించింది. అవన్నీ మనసుకు అంతగా పట్టలేదు. తట్టుకొని ఉండలేదు. గుర్తుండి పోయేంతగా నాటుకోలేదు బుర్రలో. వరించడం చేతకాలేదు.

ఆమె అతడి దుస్తులు తడిమి చూచింది.

జేబులో గడియారం ఉంది. దాన్ని పైకి తీసింది. చూసింది. గుండ్రంగా ముద్దుగా ముద్దు బంగారంలా ఉంది.

దీన్ని తీసుకుంటేనేం ? - అమ్మేసుకోవచ్చు. బోలెడంత డబ్బు వస్తుంది.

ఈ నిద్రపోతున్న మొద్దు - పెద్ద మనిషి గడియారం పోయిందన్న విషయం గూడా ఎరగడు.

ఎప్పుడో ఆ సంగతి తెలుసుకుని - ఎప్పుడు ఎక్కడ జారవిడుచుకున్నాడో గుర్తు తెచ్చుకుందుకు ప్రయత్నం చేస్తూ కాలం గడుపుతాడు.

తగుమాత్రంగా తన వస్తువు పోయినందుకు విచారించినా పోలీస్ రిపోర్ట్ మాత్రం ఇవ్వడు. అట్లాంటి విషయాల్లో ఇలాంటి మనుషులు చాలా జాగ్రత్తగా ఉంటారు. తమ పేరు, తమ ప్రతిష్ఠ - పోలీసు రికార్డులలో ఎక్కగూడదు. అందుకని ఫిర్యాదు చేయడు.

పోయింది - అని నవ్వేసి ఊరుకుంటాడు. దానిమీద కావ్యమో కథో రాసుకుంటాడు. మళ్లీ డబ్బు సంపాదించుకుంటాడు.

బుద్ధిమంతులు చేసే పని అదే !

గౌరవం కోసం గర్వంగా అతిశయంతో పాటు పడే వాళ్ల పద్ధతి ఇదే.

ఈ విషయం క్షుణ్ణంగా తెలుసునని ఆమె తనకు తాను చెప్పుకుంది. నమ్మ బలుకుకుంది.

కొత్త చిగుళ్ల కుక్కుటేశ్వరరావుకు మళ్లీ మెలుకువ వచ్చేంత వరకూ విశ్వం విశ్రమిస్తూనే ఉంది. ✦